www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్
08 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 213

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## పొత్తులకు నో..!

- జీహెచ్ఎంసీ సహా అన్ని ఎన్నికల్లోనూ సొంత బలమే
- బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా అవతరించడం
- కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజాక్షేత్రంలో ఆందోళనలు
- జనసేన పొత్తుపై జాతీయ అధిష్టానం నిర్ణయం
- బిల్లుకు కాంగ్రెస్ నేతల మద్దతు లభించే అవకాశం
- డిజిటల్ ప్రచారాలతో దూసుకెళ్తున్న కమల దళం

02

## వరంగల్, ఖమ్మంపై స్పెషల్ ఫోకస్



- వరంగల్, ఖమ్మం, కరీంనగర్ అభివృద్ధికి ఎకనామిక్ గ్రోత్ కారిడార్
- హైదరాబాద్ తరహాలో నగరాల చుట్టూ ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణం
- అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా తొలి విడతగా రూ. 5,681.04 కోట్ల ఆమోదం
- టెంపుల్, టూరిజం, ఇండస్ట్రియల్ కారిడార్ల ఏర్పాటు
- పారిశ్రామిక, వ్యవసాయ, రియల్ ఎస్టేట్ రంగాల కోసం ప్రత్యేక క్లస్టర్లు
- త్వరలో కార్పొరేషన్ ఎన్నికలున్న వేళ ఈ ప్రాజెక్ట్‌కు ప్రాధాన్యత

03

## బస్సు తుస్సు తుస్సు..!

- మార్గమధ్యంలో బస్సులు ఆగిపోవడంతో ఇబ్బందులు
- అగ్నిప్రమాదాలు, షార్ట్ సర్క్యూట్‌లతో ఆందోళన
- నడిరోడ్డుపై బస్సులు నిలవడంతో తీవ్ర నిరీక్షణ
- ఫిట్‌నెస్ లోపాలు, ప్రత్యామ్నాయాలు లేకపోవడం
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన దుస్థితి
- సమగ్ర తనిఖీలు చేపట్టి భద్రత కల్పించాలి




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సులు ప్రస్తుతం సాధారణ జనానికి తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నాయి. పర్యావరణ హితంగా నిలవాల్సిన ఈ వాహనాలు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. మెరుగైన సౌకర్యాలు అందిస్తామన్న హామీలు నీటి మీద రాతలుగా మారుతున్నాయి. రోజూ ప్రయాణం చేసే వారు నానా అవస్థలు పడుతున్నారు. సాంకేతిక లోపాలు విసుగు తెప్పిస్తున్నాయి. కరీంనగర్ జిల్లాలో జరిగిన అగ్నిప్రమాదం రాష్ట్ర ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించింది. ఆ ఘటన తర్వాత అధికారులు తనిఖీలు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. నిజామాబాద్ డిపో నుంచి నడిచే బస్సులు నిర్మల్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం పదుల సంఖ్యలో ట్రిప్పులు తిరిగే ఈ వాహనాలు మార్గమధ్యంలోనే మొరాయిస్తున్నాయి. డ్రైవర్లు చేసే ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. ప్రయాణ సమయం పెరిగిపోవడంతో పాటు

మిగతా 2లో..



## ప్రైవేట్ స్కూల్స్ కు షాక్

- ప్రైవేట్ స్కూల్స్ ఫీజుల వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరి
- స్కూళ్లలో ఫీజుల పట్టికను విధిగా ప్రదర్శించాలి
- నిబంధనలు మీరితే షోకాజ్ నోటీసులు, కఠిన చర్యలు
- కేజీ తరగతులకే లక్షల్లో ఫీజుల వసూలు
- పుస్తకాలు, యూనిఫామ్‌ల పేరుతో వేలల్లో వసూళ్లు
- తమిళనాడు తరహాలో ప్రభుత్వం ఫీజులను నియంత్రించాలి

03

## నేతన్నల కడుపు కొడుతున్న కాంగ్రెస్

- నేతన్నలకు ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ అమలు కాలేదు
- చేనేత విషయంలో బీజేపీ-కాంగ్రెస్ వైఖరి ఒక్కటేనని విమర్శ
- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు భరోసా కల్పించాలి
- కమీషన్ల కోసం ప్రైవేట్ సంస్థలకు వ్యక్తులకు అప్పజెప్తున్నారు
- బీజేపీ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతోనూ నేతన్నలకు తీవ్ర నష్టం
- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేనేత రంగానికి తీవ్ర అన్యాయం చేసింది

02



# మిల్లర్లదే రాజ్యం!

### తెలంగాణలో దశాబ్ద కాలంగా సీఎంఆర్ కుంభకోణం నిరాటంకం

- బీఆర్ఎస్‌లో రూ. 11,304 కోట్లు, కాంగ్రెస్‌లో రూ. 2,095 కోట్ల ధాన్యం పక్కదారి
- పుష్కర కాలంలో ఇంకా రూ. 6,630.74 కోట్ల రికవరీ బాకీ
- ఒక్క 2022-23 రబీలోనే రూ. 8,069 కోట్ల విలువైన ధాన్యం మిల్లర్లపాలు
- అక్రమాలు గుర్తించినా రికవరీలో ఆశించిన కఠిన చర్యలు శూన్యం
- పౌరసరఫరాల శాఖలో సీఎంఆర్ వ్యవహారాలపై విజిలెన్స్ విచారణ



విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి నేటి వరకు రైస్ మిల్లుల కస్టమ్ మిల్లింగ్ రైస్ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఈ వ్యవహారంలో పాలకుల మారినా అధికారుల తీరు మారక పోవడంతో కోట్ల రూపాయల ప్రజాధనం పాలుగారిపోతోంది. రైతుల చెమటోడ్చి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి మిల్లింగ్ కోసం ఇస్తే కొందరు మిల్లర్లు ఆ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. గత బీఆర్ఎస్ పాలనలో సుమారు తొమ్మిదిన్నరేండ్ల కాలంలో 51 లక్షలకు పైగా టన్నుల ధాన్యం లెక్కల్లో గోల్‌మాల్ జరిగినట్లు ప్రస్తుత ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. దీని మార్కెట్ విలువ 11 వేల కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా వేశారు. ఈ క్రమంలోనే కరీంనగర్ ప్రాంతానికి చెందిన కొన్ని మిల్లులు ఈ అక్రమాల్లో ముందు వరుసలో ఉన్నట్లు సివిల్ సప్లైస్ అధికారులు గుర్తించారు. నాటి మంత్రులు ఈటల రాజేందర్ అలాగే గంగుల కమలాకర్ హయాంలోనూ ఈ దోపిడీ నిరాటంకంగా కొనసాగింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ భారీ కుంభకోణానికి సంబంధించి ఇప్పటివరకు సుమారు 6 వేల కోట్ల రూపాయలు మాత్రమే రికవరీ చేయగలిగారు. ఇంకా దాదాపు 5 వేల కోట్ల రూపాయల విలువైన ధాన్యం రాబట్టాల్సి ఉందని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేస్తున్నది. కేవలం 2022 సంవత్సరపు రబీ సీజన్ లోనే 38 లక్షల టన్నులకు పైగా ధాన్యం దారి మళ్లినట్లు లెక్క తేలడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది. ఈ ఒక్క సీజన్ నష్టమే సుమారు 8 వేల కోట్ల రూపాయలు ఉంటుందని తేలింది. రికవరీ ప్రక్రియ మందకొడిగా సాగుతుండటంతో మిల్లర్లలో భయం లేకుండా పోయింది. నోటీసులు ఇవ్వడం, చట్టాలు ప్రయోగించడం నామమాత్రంగానే మారుతున్నాయి తప్ప ఆచరణలో పూర్తిస్థాయి ఫలితాలు రావడం లేదు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా పరిస్థితిలో పెద్దగా మార్పు రాలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని పౌరసరఫరాల శాఖలోనూ అక్రమాలు ఆగలేదని తాజా లెక్కలు చెబుతున్నాయి. ఈ కాంగ్రెస్ పాలనా కాలంలోనూ సుమారు 8 లక్షల టన్నుల మేర బియ్యం దారి మళ్లినట్లు విజిలెన్స్ ఆడిట్లో తేలింది. దీని విలువ సుమారు 2 వేల కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా వేశారు. ఈ కొత్త కాలంలో కేవలం 400 వందల కోట్ల రూపాయలు మాత్రమే రికవరీ సాధించగా మిగతా మొత్తం ఇంకా పెండింగ్ జాబితాలోనే ఉంది. రెండు ప్రభుత్వాల హయాంలో జరిగిన మొత్తం కుంభకోణాలను పరిశీలిస్తే సుమారు 6 వేల కోట్ల రూపాయలకు పైగా రికవరీ చేయాల్సిన బకాయిలు అలాగే నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వంలోనూ సీఎంఆర్ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ జరుగుతుండటం సెక్రటేరియట్ వర్గాలలో హాట్ టాపిక్‌గా మారింది. స్వయంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ దందాపై

మిగతా 2లో..


# వానల కోసం రేవంత్ యాగం!



- నాగార్జునసాగర్ విజయవిహార్‌లో భారీ వరుణ యాగం
- వర్షా లు కురిసి నదులు-జలాశయాలు నిండి రైతులు సుభిక్షంగా
- మంత్రి ఉత్తమ్ ఆధ్వర్యంలో, యాదగిరిగుట్ట వేద పండితుల పర్యవేక్షణ
- 11 హోమగుండాలు, 108 మంది వేద పండితులతో మహా క్రతువు
- ఆగస్టు 10న జరిగే పూర్ణాహుతిలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటారు
- సాగర్ కింద 22 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాష్ట్రంలో విస్తారంగా వానలు కురవాలని, నదులు జలాశయాలు నీటితో నిండిపోవాలని, రైతులు పాడిపంటలతో సుభిక్షంగా జీవించాలని ప్రభుత్వం గొప్ప సంకల్పంతో ముందుకు సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ఆదేశాల మేరకు నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ తీరంలో విజయవిహార్ ప్రాంగణంలో భారీ వరుణ యాగం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. యాదగిరిగుట్ట ప్రధాన అర్చకులు వేద పండితులు కలిసి ఈ కార్యక్రమానికి ఆగస్టు పదవ తేదీని అత్యంత శుభ ముహూర్తంగా నిర్ణయించారు. గత పాలకులు తమ స్వార్థం కోసం ప్రజాధనం ఖర్చు చేసి పూజలు చేశారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ప్రజలందరి సంక్షేమం కోసమే ఈ పవిత్ర కార్యక్రమం చేపట్టిందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఎల్ నినో ప్రభావం పూర్తిగా తొలగిపోయి రైతన్నలకు సాగునీరు పుష్కలంగా అందాలనే గొప్ప లక్ష్యంతో ఈ యాగం రూపుదిద్దుకుంది. ఈ మహా యాగం నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర నీటిపారుదల శాఖ

మిగతా 2లో..



## ఉచిత పథకాలపై హైకోర్టు సీరియస్

- తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు
- ఉచిత పథకాలపై న్యాయమూర్తి ఆందోళన
- ధనికులకు లబ్ధితో భారీ ఆర్థిక భారం
- గ్రామీణ ప్రాంతాల్లో కూలీల కొరత సమస్య
- అర్హులకే సంక్షేమ ఫలాలు అందించాలి
- పబ్లిక్ మనీ దుర్వినియోగం కాకూడదు

03

## కృష్ణా జలాల్లో రాష్ట్ర హక్కులను సాధిస్తాం!

- పాలమూరు ప్రాజెక్టులపై బీఆర్ఎస్ ఆరోపణలు అవాస్తవం
- అధికారుల ప్రణాళిక ప్రకారమే జూరాల, నెట్టెంపాడుల నిర్వహణ
- లబ్ధికోసమే ప్రాజెక్టుల వద్ద బీఆర్ఎస్ హంగామా
- పాలమూరు-రంగారెడ్డి సహా పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి హామీ
- గత బీఆర్ఎస్ హయాంలోనే కృష్ణా జలాల్లో రాష్ట్రానికి ద్రోహం
- ఆందోళన వద్దు, సాగు, తాగునీరు అందిస్తామని స్పష్టీకరణ




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, సాగునీటి అధికారుల ప్రణాళిక మేరకే జూరాల, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీటి నిర్వహణ జరుగుతోందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాకు నీళ్లు ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ప్రజలను తప్పుదోవ పట్టించి రాజకీయ లబ్ధి పొందేందుకే ఆ పార్టీ నేతలు ప్రాజెక్టుల వద్ద హంగామా చేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వంద శాతం పూర్తి చేసి

మిగతా 3లో..

# వానల కోసం రేవంత్ యాగం!

**మొదటిపేజీ తరువాయి**

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ప్రభుత్వం అప్పగించింది. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన అర్చక బృందం వైదిక శాస్త్ర ప్రకారం పూజలు నిర్వహిస్తారు. విజయవిహార్ ప్రాంగణంలో ప్రత్యేకంగా పదకొండు హోమగుండాలను సర్వాంగ సుందరంగా సిద్ధం చేస్తున్నారు. ఈ బృహత్తర క్రతువులో నూటఎనిమిది మంది నిపుణులైన వేద పండితులు ఋత్వికులు పాల్గొని శక్తివంతమైన మంత్రోచ్చారణలు చేస్తారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కింద ఉన్న సుమారు ఇరవై రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సాఫీగా అందాలని కోరుకుంటారు. కృష్ణా గోదావరి నదులు రెండు పరవళ్ళు తొక్కి పొంగిపొర్లాలని అందరూ భగవంతుడిని మనసారా ప్రార్థిస్తారు. ప్రకృతి సహకరించి రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లేలా చూడాలని ఈ పవిత్ర వైదిక కార్యక్రమం ద్వారా వేడుకుంటారు. ఆగస్టు 10వ తేదీన మధ్యాహ్నం 3 గంటల 20 నిమిషాల నుంచి 3 గంటల 24 నిమిషాల మధ్యలో పవిత్ర మహా పూర్ణాహుతి కార్యక్రమం అత్యంత వైభవంగా జరుగుతుంది. ఈ విశేష కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పాల్గొని ప్రత్యేక పూజలు సమర్పిస్తారు. ప్రకృతి శక్తులను ప్రసన్నం చేసుకునేందుకు ఆధునిక కాలంలో కూడా ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చాలా అవసరమని పెద్దలు భావిస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే గ్రామీణ




ఆర్థిక వ్యవస్థ బలపడి సామాన్య ప్రజలకు ఉపాధి దొరుకుతుందని అందరూ గట్టిగా నమ్ముతున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్త చర్యగా ప్రభుత్వం ఈ ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకుంది. ప్రజల కష్టాలు తీర్చడానికి ప్రజాప్రతినిధులు అధికారులు అందరూ కలిసికట్టుగా ఈ బృహత్తర యాగ నిర్వహణను విజయవంతం చేయాలని ఉత్సాహంగా శ్రమిస్తున్నారు. తెలంగాణ ప్రాంతంలో ప్రతి ఏటా వర్షాకాలంలో వానలు సరిగ్గా పడకపోతే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. సాగునీరు అందక పంటలు ఎండిపోయి అప్పులపాలవుతున్న దుస్థితిని మార్చడమే ఈ యాగం ముఖ్య ఉద్దేశం. సైన్స్ తో పాటు మన సంప్రదాయాలను నమ్మడం ద్వారా సామాజిక భద్రత కలుగుతుందని ప్రజలు భావిస్తున్నారు. యువత కూడా ఈ కార్యక్రమాల వెనుక ఉన్న సామాజిక కోణాన్ని అర్థం చేసుకొని ప్రభుత్వానికి తమ వంతు సహకారం అందిస్తున్నారు. నదులు జలాశయాలు కళకళలాడుతుంటే చూసేందుకు రెండు కళ్ళు చాలవని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో సాగునీటి రంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మహా యాగం ద్వారా రాష్ట్రంలోని ప్రతి నీటి వనరు నిండిపోతుందని అందరూ ధీమాతో ఉన్నారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే శక్తిని ఇవ్వాలని కోరుకుంటూ చేపట్టే ఈ క్రతువు చరిత్రలో నిలిచిపోతుందని నిర్వాహకులు చెబుతున్నారు. రాజకీయాలకు అతీతంగా రైతుల సంక్షేమం ఒక్కటే లక్ష్యంగా ఈ యాగం జరుగుతుండటం విశేషం. ప్రజలందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ పవిత్ర కార్యక్రమంలో పాలుపంచుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. భవిష్యత్తు తరాలకు తాగునీటి సమస్య రాకుండా ముందస్తుగా దేవుని ఆశీస్సులు కోరడం మన సనాతన సంప్రదాయం. ఈ యాగం విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించాలని ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. వర్షాలతో తొలకరి పలకరింపులు రాష్ట్రమంతా పాడిపంటల శోభను తెస్తాయని అందరూ బలంగా నమ్ముతున్నారు.

# ప్రజారోగ్యం, పారిశుధ్యంపై సైబరాబాద్ కార్పొరేషన్ సమీక్ష

- **వర్షా కాల వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి**
- **క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని కమిషనర్ శ్రీజన ఆదేశం**

**సైబరాబాద్ - విశాల భారతి**



సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో ప్రజారోగ్యం, పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని కమిషనర్ గుమ్మల శ్రీజన అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్న నేపథ్యంలో నివారణ చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. ప్రజారోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి సర్కిల్‌లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజారోగ్యం, పారిశుధ్య సమీక్షా సమావేశంలో అదనపు కమిషనర్ (ఆరోగ్యం, పారిశుధ్యం), జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఆరోగ్యాధికారులు, పారిశుధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు. ఆయా సర్కిళ్లలో ప్రస్తుతం అమలవుతున్న పారిశుధ్య కార్యక్రమాలు, ప్రజారోగ్య చర్యలు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యలను అధికారులు కమిషనర్‌కు వివరించారు. సమావేశంలో బల్క్ వేస్ట్ జనరేటర్ల నమోదును వేగవంతం చేయడంతో పాటు వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. నగరంలో ఈవీ చార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు, ఆకాంక్ష టాయిలెట్ల నిర్మాణ పురోగతి, స్వచ్ఛ భారత్ మిషన్ నిధుల వినియోగం, పారిశుధ్య మౌలిక వసతుల అభివృద్ధిపై సమగ్రంగా సమీక్షించారు. ప్రతి సర్కిల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు పొగమందు పిచికారీని నిరంతరాయంగా నిర్వహించాలని సూచించారు. దోమల లార్వా నిర్మూలన కోసం గాంబుసియా చేపలను చెరువులు, నీటి నిల్వ ప్రాంతాల్లో వదలడంతో పాటు ఆయిల్ బాల్స్ వినియోగాన్ని విస్తరించాలని చెప్పారు. గత సంవత్సరాల్లో నమోదైన వ్యాధుల ధోరణులను విశ్లేషించి అధిక ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సురక్షిత ఆహారం అందేలా హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ఆహార విక్రయ కేంద్రాల్లో ఆహార భద్రతా తనిఖీలను మరింత విస్తరించాలని సూచించారు. గతంలో లోపాలు గుర్తించిన సంస్థల్లో తిరిగి తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే వ్యాధుల నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ప్రజారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీధి కుక్కల నియంత్రణ చర్యలపై కూడా సమావేశంలో చర్చించారు. కుక్కలకు యాంటీ రేబిస్ టీకాల కార్యక్రమాన్ని వేగవంతం చేయడంతో పాటు జంతు జనన నియంత్రణ (ఏబీసీ) కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. మృత జంతువుల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా జంతు దహన కేంద్రాల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.



# మిల్లర్లదే రాజ్యం!

**మొదటిపేజీ తరువాయి**

సమీక్ష నిర్వహించి ప్రతి గింజా ప్రజల ఆస్తేనని స్పష్టం చేశారు. డిఫాల్ట్ మిల్లర్ల భరతం పడతామని, రికవరీ కోసం ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. నిజాయితీగా పనిచేసే మిల్లర్లకు ఎలాంటి ఇబ్బందులు రావని ప్రభుత్వం భరోసా ఇస్తున్నది. అయితే గత రెండున్నరేండ్లుగా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందనే అభిప్రాయం యువతలో బలపడుతోంది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో రెవెన్యూ రికవరీ చట్టాలను కఠినంగా అమలు చేస్తేనే ఇలాంటి అక్రమాలకు శాశ్వత బ్రేక్ పడే అవకాశం ఉంటుంది. తెలంగాణ ఏర్పడి పుష్కర కాలం గడిచినా పేదల కడుపు కొట్టే ఈ మిల్లింగ్ మాఫియా అంతు చూడటంలో పాలకులు విఫలమవుతున్నారు. డిఫాల్ట్ అయిన మిల్లర్ల ఆస్తులను జప్తు చేసి ప్రతి పైసా కక్కిస్తామనే మాటలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. ఈ తరుణంలో పారదర్శకమైన ఆడిట్ నిర్వహించి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. అప్పుడే అన్నదాతల కష్టంతో పండే పంట దోపిడీకి గురికాకుండా కాపాడుకోగలుగుతాం. డిజిటల్ యుగంలో బతికే నేటి తరానికి ఈ అవినీతి లెక్కలు స్పష్టంగా అర్థమవుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలవంచకుండా కఠిన నిర్ణయాలు తీసుకుంటేనే మిల్లర్ల అక్రమాలకు తెరపడుతుంది.

# పొత్తులకు నో..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ ప్రత్యేక వ్యూహంతో వేగంగా ముందుకు సాగుతోంది. రాబోయే అన్ని ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేయాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ ఎన్నికలలో ఎవరితోనూ పొత్తులు ఉండవని తేల్చిచెప్పింది. తమ సొంత బలంతోనే బరిలోకి దిగి సత్తా చాటాలని కమలనాథులు భావిస్తున్నారు. పార్టీ సంస్థాగత బలాన్ని క్షేత్రస్థాయిలో మరింత పెంచుకోవడానికి పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జాతీయ అధ్యక్షుడితో జరిగిన ఉన్నత స్థాయి సమావేశం అనంతరం ఈ విషయాలపై పూర్తి స్పష్టత వచ్చింది. రాష్ట్రంలో అధికారంలోకి రావడమే ఏకైక లక్ష్యంగా నాయకులు అడుగులు వేస్తున్నారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగడమే ధ్యేయంగా పార్టీ కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. జనసేన పార్టీ పొత్తుల అంశంపై జాతీయ నాయకత్వం తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. జాతీయ స్థాయిలో జనసేన ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా కొనసాగుతోందని అందరికీ తెలిసిందే. అయితే తెలంగాణ స్థానిక రాజకీయ పరిస్థితులను బట్టి అధి



ష్ఠానం తుది నిర్ణయం ప్రకటిస్తుందని స్పష్టంచేశారు. రాష్ట్ర శాఖ మాత్రం ప్రస్తుతానికి ఒంటరి పోరుకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. ఇతర పార్టీల నుంచి వచ్చే నాయకులను సాదరంగా ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. పార్టీలో పాత కొత్త అనే భేదాలు అసలు ఉండవని స్పష్టమైన భరోసా కల్పించారు. అందరినీ కలుపుకొని సమష్టిగా ముందుకు సాగేందుకే నాయకత్వం పెద్దపీట వేస్తోందన్నారు. రాష్ట్ర యువతకు రాజకీయాలపై సరికొత్త ఆశలు కల్పిస్తూ బీజేపీ దూసుకుపోతోంది. ప్రస్తుత యువత ఆలోచనలకు తగినట్లుగా డిజిటల్ ప్రచారాలతో పాటు క్షేత్రస్థాయి ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ మోసాలను ఎండగడుతూ ప్రజలకు వాస్తవాలు వివరిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో పార్టీ శ్రేణులు పూర్తిగా నిమగ్నమయ్యాయి. ముఖ్యంగా ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే ప్రజాక్షేత్రంలో పోరాటాలు నిర్వహిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో బలమైన అభ్యర్థులను గుర్తించే కీలకమైన పనిలో నాయకత్వం నిమగ్నమైంది. త్వరలోనే అన్ని స్థానాలకు సరైన నాయకులను ఎంపిక చేసి ప్రజల ముందుకు తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఒడిశా పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల కంటే తెలంగాణలో పార్టీ సంస్థాగతంగా ఎంతో పటిష్టంగా ఉందని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని గట్టిగా నమ్ముతున్నారు. ఎలాంటి అవినీతి లేని పాలనను అందించడమే తమ ప్రధాన ధ్యేయమని ప్రజలకు చెబుతున్నారు. రాబోయే కాలం కమల దళానిదేనని యువత నమ్ముతోందని గట్టిగా ధీమా వ్యక్తం చేస్తున్నారు. డీలిమిటేషన్ బిల్లు అంశంపై కూడా రాంచందర్ రావు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు సైతం మద్దతు తెలిపే అవకాశం ఉందని చెప్పారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఈ బిల్లు పార్లమెంటులో సులభంగా ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అంతర్గత విషయాలపై స్పందిస్తూ నాయకుల మధ్య చిన్నపాటి భేదాభిప్రాయాలు ఉండటం సహజమని తెలిపారు. అయితే పార్టీ ప్రయోజనాల విషయంలో ఎవరికీ ఎలాంటి విభేదాలు లేవని తేల్చిచెప్పారు. అందరూ కలిసికట్టుగా ఒకే లక్ష్యంతో పార్టీ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారని స్పష్టంచేశారు. ఈ ఐక్యతతోనే భవిష్యత్తులో రాజకీయంగా అద్భుతాలు సాధిస్తామని ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ ముందుకు సాగుతామని పునరుద్ఘాటించారు. తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగరవేయడమే ఏకైక లక్ష్యంగా శ్రేణులు పనిచేస్తున్నాయి. ఈ ప్రయాణంలో రాష్ట్ర ప్రజల మద్దతు సంపూర్ణంగా లభిస్తుందని గట్టిగా నమ్ముతున్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాయకులు అందరూ సమన్వయంతో కష్టపడి పనిచేస్తున్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రజా సమస్యలపై ఎల్లప్పుడూ పోరాటాలు చేస్తామని ప్రకటించారు. యువత భాగస్వామ్యం రాజకీయ మార్పునకు అత్యంత కీలకమని భావిస్తున్నారు. అందుకే యువతను ఆకర్షించేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపకల్పన చేసి అమలు చేస్తున్నారు. ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొడుతూ ముందుకు వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సత్తా బీజేపీకి మాత్రమే ఉందని నమ్ముతున్నారు. రాబోయే కాలంలో తెలంగాణ రాజకీయాల్లో సంచలనాత్మక మార్పులు రావడం ఖాయమని స్పష్టమైంది. కమల దళం ఉత్సాహం చూస్తుంటే అధికారం దిశగా బలమైన అడుగులు పడుతున్నాయని స్పష్టంగా అర్థమవుతోంది. పార్టీ శ్రేణుల కష్టం ఫలితంగా భవిష్యత్తులో రాజకీయ దృశ్యమే పూర్తిగా మారిపోతుంది.

# బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొడిపెల్లి గోపాల్ రెడ్డి

**విశాలభారతి, కథలాపూర్ :** భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొడిపెల్లి గోపాల్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా కథలాపూర్ మండలంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించిన కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీ నరసయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీ అరవింద్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిన్నమనేని వికాస్ రావు, రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడు రెడ్డిబోయిన గోపన్న, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. గత పదేళ్లుగా జగిత్యాల జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించినట్లు గోపాల్ రెడ్డి తెలిపారు. ఆ సమయంలో తనకు సహకరించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ముఖ్యంగా కథలాపూర్ మండల నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా అప్పగించిన రాష్ట్రస్థాయి బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని కొడిపెల్లి గోపాల్ రెడ్డి తెలిపారు.



# బస్సు తుస్సు తుస్సు..!

**మొదటిపేజీ తరువాయి**

గమ్యస్థానాలకు సమయానికి చేరడం గగనమవుతోంది. నిర్మల్ జిల్లా కేంద్రంలో గత వారం భారీ వర్షాలు కురిశాయి. ఆ సమయంలో ఓ ఎలక్ట్రిక్ బస్సు నడిరోడ్డుపై హ్యాండ్సప్ చెప్పింది. మునిసిపల్ రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎండలో లేదా వానలో ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. సోన్ మండలం వద్ద నేషనల్ హైవే నంబర్ 44 మీద కూడా ఇలాంటి ఘటనే పునరావృతమైంది. రాత్రి వేళ ప్రయాణికులతో వెళ్తున్న బస్సు సడన్‌గా నిలిచిపోయింది. చీకటి పడిన తర్వాత నూతన సాంకేతికత కలిగిన బస్సు ఎక్కడికక్కడ ఆగిపోవడం విడ్డూరంగా మారింది. ప్రయాణికులు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. బస్సు సిబ్బంది సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ప్రయాణికులు సొంత ఖర్చులతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. అర్ధరాత్రి వేళల్లో మహిళలు పిల్లలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. రవాణా శాఖ నిర్లక్ష్యం ప్రయాణికులపట్ల శాపంగా మారుతోంది. సాంకేతిక లోపాలతో వాహనాలు రోడ్డెక్కడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రయాణికుల ప్రాణాలతో అధికారులు చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఎలక్ట్రిక్ బస్సుల తయారీ నాణ్యతపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రోడ్డుపై వెళ్తుండగా బ్యాటరీలు పేలడం లేదా షార్ట్ సర్క్యూట్ కావడం వంటి ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిత్యం ప్రయాణం చేసే ఉద్యోగులు విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. కాలేజీలకు ఆఫీసులకు వెళ్లే వేళల్లో బస్సులు ఆగిపోతే నష్టం ఎవరిదని ప్రజలు నిలదీస్తున్నారు. బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలను కేవలం తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారనే విమర్శలు నిజమవుతున్నాయి. ప్రతి డిపోలోనూ ప్రత్యేక సాంకేతిక నిపుణులను నియమించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. కనీస నిర్వహణ ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే ఈ దుస్థితి తలెత్తుతోంది. చిన్నపాటి లోపాలను కూడా గుర్తించడంలో సాంకేతిక సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. అత్యవసర పనులపై వెళ్లేవారికి ఈ ప్రయాణం నరకంగా మారుతోంది. ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ అధికారులు తాత్కాలిక ప్రకటనలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. సర్వీసులు పునరుద్ధరించామని చెప్పి మళ్లీ పాత పాటే పా





డుతున్నారు. నిర్మల్ డిపో అధికారుల తీరుపై స్థానికులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఫోన్ చేసినా స్పందించే నాథుడు కరువయ్యాడు. ప్రయాణికుల రక్షణ గాలికి వదిలేసి లాభాల కోసం మాత్రమే ఆర్టీసీ పనిచేస్తోందనే భావన కలుగుతోంది. నూతన సాంకేతికతను స్వాగతిస్తున్నప్పటికీ దానికి తగిన మౌలిక వసతులు కల్పించడంలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చార్జింగ్ స్టేషన్ల నిర్వహణ లోపం కూడా బస్సుల వైఫల్యానికి ఒక కారణమని తెలుస్తోంది. నిపుణుల పర్యవేక్షణ లేకుండా రోడ్డెక్కిస్తున్న ఈ బస్సులను తక్షణమే నిలిపివేయాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణాలు సాగించడం సరికాదని హితవు పలుకుతున్నారు. సోషల్ మీడియా వేదికగా కూడా ఈ సమస్యలపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ పెద్దలు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఎలక్ట్రిక్ బస్సుల ప్రయాణం సురక్షితంగా మారాలంటే ప్రభుత్వం కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి. ప్రతీ రోజు ట్రిప్పులు ప్రారంభించే ముందు సమగ్ర తనిఖీలు తప్పనిసరి చేయాలి. లోపాలు ఉన్న వాహనాలను రోడ్డు మీదకు అనుమతించకూడదు. తయారీ కంపెనీల భాగస్వామ్యంతో ప్రత్యేక మెకానిక్ బృందాలను అందుబాటులో ఉంచాలి. అత్యవసర వేళల్లో ప్రత్యామ్నాయ బస్సులను వెంటనే పంపేలా రవాణా శాఖ నిఘా పెంచాలి. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారానే ప్రజా రవాణాపై నమ్మకం పెరుగుతుంది. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రయాణ భద్రత కూడా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైన అంశాలు కావాలి. నిర్మల్ నిజామాబాద్ మార్గంలో రోజూ తిరిగే బస్సుల పరిస్థితిని ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షించాలి. బాధ్యత రహితంగా వ్యవహరించే సిబ్బందిపై వేటు వేయాలి. ప్రయాణికుల నుంచి వస్తున్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా ఒక ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలి.

# నేతన్నల కడుపు కొడుతున్న కాంగ్రెస్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ సర్కార్ నేతన్న కడుపు కొడుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో అమలైన చేనేత సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని నేతన్నల తరఫున ముఖ్యమంత్రి రేవంత్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి వెన్నెముకగా నిలిచిన చేనేత కార్మికుల పరిస్థితి కాంగ్రెస్ పాలనలో తీవ్రంగా దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి నేతన్నల కోసం ప్రత్యేకంగా అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను నిలిపివేసి నేతన్నలను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని ఆరోపించిన కేటీఆర్, వెంటనే అన్ని పథకాలను పునరుద్ధరించి నేతన్నలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం కేవలం ఉత్సవాలు నిర్వహించుకునే రోజు కాదని, చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధానాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ కలిసి చేనేత రంగాన్ని సంక్షోభం వైపు నెడుతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా చేనేత రంగానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 55,072 మంది చేనేత కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పిస్తూ 'నేతన్న బీమా' అమలు చేశామని తెలిపారు. ఒక్కో కార్మికుడికి ప్రీమియం ప్రభుత్వమే భరించిందని వివరించారు. 'నేతన్నకు చేయూత' పథకం ద్వారా కార్మికుల పొదుపును ప్రోత్సహిస్తూ, కార్మికుడు ప్రతి నెలా రూ.1,200, అనుబంధ కార్మికుడు రూ.800 చెల్లిస్తే ప్రభుత్వం రూ.4,000 వరకు వాటా జమ చేసే వినూత్న విధానాన్ని అమలు చేశామని తెలిపారు. అదే విధంగా చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, 20 శాతం మార్కెటింగ్ రిబేట్ అందించడంతో పాటు బతుకమ్మ చీరలు, ప్రభుత్వ పాఠశాల యూనిఫారాల తయారీ వంటి భారీ ప్రభుత్వ ఆర్డర్లను చేనేత రంగానికే అప్పగించి వేలాది కుటుంబాలకు నిరంతర ఉపాధి కల్పించామని పేర్కొన్నారు.

**చేనేత సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిలిపివేసింది**



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిలిపివేసిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రస్తుతం 'నేతన్న బీమా' అమలు కావడం లేదని, 'నేతన్నకు చేయూత' పథకం చెల్లింపులు పూర్తిగా ఆగిపోయాయని పేర్కొన్నారు. చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు నిలిచిపోయాయని, బతుకమ్మ చీరలు, ప్రభుత్వ యూనిఫారాల వంటి ప్రభుత్వ ఆర్డర్లలో నేతన్నలకు గతంలో ఇచ్చిన ప్రాధాన్యతను తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వ ఆర్డర్లు అన్ని కమీషన్ల కోసం ప్రైవేట్ సంస్థలకు వ్యక్తులకు అప్పజెప్తున్నారని విమర్శించారు.

**నేతన్నలకు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితం**

నేతన్నల కోసం గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయని కేటీఆర్ ప్రశ్నించారు. అడ్డగోలుగా హామీలు ఇచ్చి అందరిని మోసం చేసినట్లుగానే నేతన్నలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నది అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కేటీఆర్ అన్నారు. చేనేత భరోసా కింద ప్రతి ఏడాది రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.6 వేల సహాయం, లక్ష రూపాయల వరకు వ్యక్తిగత రుణమాఫీ, చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాల మాఫీ, కేంద్రం విధిస్తున్న 5 శాతం జీఎస్టీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్న హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. రెండున్నరేళ్లు గడిచినా నేతన్నలకు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా చేనేత రంగానికి తీవ్ర అన్యాయం చేసిందని కేటీఆర్ విమర్శించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డులను రద్దు చేయడం, హౌస్ కమ్ వర్క్‌షెడ్ వంటి పథకాలను ఎత్తివేయడం, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ విధించడం వంటి నిర్ణయాలు చేనేత రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని పేర్కొన్నారు. పార్టీలు వేరైనా చేనేత విషయంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరిలో ఎలాంటి తేడా లేదని ఆరోపించారు. రాష్ట్రంలోని నేతన్నల తరఫున ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. చేనేత కళాకారుల కోసం ప్రత్యేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని, గతంలో రద్దు చేసిన అన్ని పథకాలను పునరుద్ధరించాలని కోరారు. ముఖ్యంగా కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' పథకాలను వెంటనే తిరిగి ప్రారంభించి బకాయిలు విడుదల చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన చేనేత భరోసా, రుణమాఫీ, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "మన చేనేత... మన గౌరవం. నేతన్న బతికితేనే చేనేత బతుకుతుంది. చేనేత బతికితేనే మన సంస్కృతి, మన స్వాభిమానం సజీవంగా ఉంటాయి. ఇప్పటికైనా మోసపూరిత వైఖరిని వీడి నేతన్నల కుటుంబాలకు అండగా నిలవాలి" అని కేటీఆర్ తన లేఖలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

# కృష్ణా జలాల్లో రాష్ట్ర హక్కులను సాధిస్తాం!

**మొదటిపేజీ తరువాయి**

రైతులకు సాగునీరు అందిస్తామని చెప్పారు. శుక్రవారం సచివాలయం మీడియా సెంటర్‌లో ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, ఈఎన్సీ రమేష్‌బాబు, సీఈ విజయభాస్కర్‌రెడ్డితో కలిసి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జూరాలతో పాటు ఇతర ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో పెరుగుతోందని, వచ్చిన నీటికి అనుగుణంగా సాగునీటి అధికారులు ప్రణాళిక ప్రకారం విడుదల చేస్తున్నారని మంత్రి చెప్పారు. ఈ విషయం ముందే తెలిసిన బీఆర్ఎస్ నేతలు ప్రాజెక్టుల వద్ద హంగామా, ఆర్భాటాలు, డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. అధికారులు నీళ్లు విడుదల చేసిన వెంటనే అది తమ ఒత్తిడితో జరిగిందని ప్రచారం చేసుకోవడానికే ఈ రాజకీయ నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. పాలమూరు బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి, పాలమూరు జిల్లా అల్లుడు సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీళ్లు ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమన్నారు. వారి సారథ్యంలోనే ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు కాంగ్రెస్ హయాంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టులను పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందన్నారు. కల్వకుర్తి కింద అదనంగా 25 టీఎంసీల నీటిని అందించే ప్రాజెక్టును ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, కల్వకుర్తి ఎత్తిపోతల పనులను ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. పంపులు, మోటార్లు, కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. మల్లన్నసాగర్‌పై గొప్పలు చెప్పుకున్న బీఆర్ఎస్ పాలమూరు సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు విస్మరించిందని విమర్శించారు. భీమా




ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందించే అవకాశాన్ని కోల్పోయిందన్నారు. జూరాలకు 50 టీఎంసీల వినియోగానికి అవసరమైన రిజర్వాయర్లు, గట్టు, తుమ్మిళ్ల వంటి ప్రాజెక్టులను ఎందుకు నిర్లక్ష్యం చేసిందని ప్రశ్నించారు. తెలంగాణ నీటి హక్కులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం "అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు" ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేసిందని మంత్రి ధ్వజమెత్తారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో 811 టీఎంసీల నీటిలో తెలంగాణకు అధిక వాటా సాధించుకునే అవకాశాన్ని వదులుకుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు కేవలం 299 టీఎంసీల హక్కులు కల్పించే పరిస్థితిని తీసుకొచ్చిందన్నారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పోరాడుతోందని, కృష్ణా జలాల్లో రాష్ట్ర హక్కులను సాధించి తీరుతామని స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందని మంత్రి తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వంద శాతం పూర్తి చేస్తామని చెప్పారు. పాలమూరు బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అనేక ప్రాజెక్టులకు పరిపాలనా అనుమతులు ఇవ్వకుండా, టెండర్లు పిలవకుండా, పనులు ప్రారంభించకుండా కాలయాపన చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిన వారే ఇప్పుడు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావం ఉన్నందున అధికారులు సూచిస్తున్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు మంత్రి సూచించారు. పంట కొనుగోలు, బోనస్‌పై బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమన్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్‌కు డెడ్‌లైన్ విధించి అధికారానికి దూరం చేశారని, ఇక ఆ పార్టీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదన్నారు. రాజకీయ గప్పాలు చెప్పడం తప్ప పాలన తెలియదని, తెలంగాణ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వృథా చేసి రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. పాలమూరు జిల్లా రైతులు, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ ప్రాధాన్యంగా తీసుకుని వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు.

# ప్రైవేట్ స్కూల్స్ కు షాక్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ కోసం విద్యాశాఖ ఇటీవల కీలకమైన ఆదేశాలు జారీ చేసింది. ఏ తరగతికి ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ఆ వివరాలను విద్యాశాఖ అధికారిక పోర్టల్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ప్రతి స్కూల్ ప్రాంగణంలోనూ ఫీజుల పట్టికను అందరికీ కనిపించేలా ప్రదర్శించడం నిబంధనగా మార్చింది. ఈ ఆదేశాలను బేఖాతరు చేసే యాజమాన్యాలకు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించింది. నిబంధనలు పాటించని పక్షంలో పాఠశాలల గుర్తింపు రద్దు చేయడం వంటి కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. ప్రభుత్వ ఈ నిర్ణయం పట్ల సామాన్య ప్రజలు కొంతమేర సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరుతూ సామాజిక మాధ్యమాలలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రస్తుత కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. కనీసం అక్షరాలు కూడా సరిగ్గా రాని నర్సరీ చిన్న పిల్లలకే ఏడాదికి 30 వేల రూపాయల నుండి లక్ష రూపాయల వరకు ఫీజులు లాగుతున్నాయి. కార్పొరేట్ హంగులు చూపించి అమాయక తల్లిదండ్రుల నుండి భారీగా డబ్బులు గుంజుతున్నాయి. కేవలం పాఠశాల ఫీజులతో సరిపెట్టకుండా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు అన్నీ తమ పాఠశాలలోనే కొనుగోలు చేయాలని బలవంతం చేస్తున్నాయి. బయట మార్కెట్లో తక్కువ ధరకు లభించే వస్తువులను కూడా స్కూళ్లలో అత్యధిక ధరలకు విక్రయిస్తూ వేల రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నాయి. ఈ ఆర్థిక భారాన్ని ఎదిరించలేక తల్లిదండ్రులు తీవ్రమైన మానసిక వేదనకు గురవుతున్నారు. ఆధునిక కాలంలో చదువు వ్యాపారంగా మారిపోయిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విపరీతమైన ఫీజుల మోత కారణంగా మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పిల్లల చదువుల కోసం తమ ఇళ్లు లేదా భూములు తాకట్టు పెట్టాల్సిన దుస్థితి నేడు ఏర్పడింది. ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల అనైతిక వ్యాపార ధోరణిని ఎక్కడికక్కడ ప్రశ్నిస్తూ సోషల్ మీడియా వేదికగా తమ నిరసనలను బాహాటంగా వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడు రాష్ట్రంలో అమలులో ఉన్న విధంగా ప్రభుత్వమే స్వయంగా ప్రైవేట్ పాఠశాలల ఫీజులను ఖరారు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతి జిల్లాలోనూ ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి పాఠశాలల ఆర్థిక లావాదేవీలను నిరంతరం పర్యవేక్షించాలని కోరుతున్నారు. ప్రజల నుంచి వస్తున్న ఈ డిమాండ్లను తీవ్రంగా పరిశీలించి ప్రభుత్వం మరింత కఠినమైన చట్టాలను తీసుకురావాల్సిన అవసరం ఉంది. రాబోయే రోజుల్లో విద్యా వ్యవస్థ ప్రక్షాళన జరగాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. విద్యాశాఖ తాజాగా జారీ చేసిన ఈ కొత్త ఆదేశాల ద్వారా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని తల్లిదండ్రులు ఆశిస్తున్నారు. పోర్టల్‌లో ఫీజుల వివరాలు బహిర్గతం కావడం వల్ల ఏ పాఠశాల ఎంత వసూలు చేస్తుందనే స్పష్టత అందరికీ లభిస్తుంది. దీనివల్ల ఫీజుల విషయంలో జరుగుతున్న మోసాలు తగ్గే అవకాశం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. అయితే కేవలం ఆదేశాలు ఇవ్వడమే కాకుండా క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం చాలా ముఖ్యం. నిబంధనలను ఉల్లంఘించే పాఠశాలలపై ఎలాంటి ఒత్తిళ్లకు తలవంచకుండా కఠినంగా వ్యవహరించాలి. అప్పుడే ప్రభుత్వ ఆదేశాలకు నిజమైన సార్థకత చేకూరుతుంది అలాగే పేద కుటుంబాలకు ఆర్థిక భారం నుంచి నిజమైన ఉపశమనం లభిస్తుంది. యువత భవిష్యత్తు కోసం ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు పక్కాగా అమలు కావాలి. భవిష్యత్తు తరాల బంగారు భవిత కోసం విద్యను వ్యాపారం కాకుండా సేవలా మార్చాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి శాశ్వత ముగింపు పలకాలంటే ప్రభుత్వ పర్యవేక్షణ అత్యంత కఠినంగా ఉండాలి. తల్లిదండ్రులు కూడా ఒక్కటై అనవసరమైన ఖర్చులు తగ్గించే పాఠశాలలను ఎంచుకోవడానికి ముందుకు రావాలి. విద్యాశాఖ తీసుకున్న ఈ తాజా చర్యలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పక్కాగా అమలయ్యేలా చూడాలి. అప్పుడే రాష్ట్రంలో నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులోకి వస్తుంది. ప్రైవేట్ స్కూల్స్ ఇష్టారాజ్యానికి తెరపడి విద్యార్థుల తల్లిదండ్రులకు నిజమైన స్వేచ్ఛ లభిస్తుంది. రాబోయే తరాలకు సరైన దిశ నిర్దేశం చేయడానికి పారదర్శకమైన విద్యా విధానం అత్యంత అవసరం. ఈ దిశగా ప్రభుత్వాలు మరింత చొరవ తీసుకుని ముందుకు సాగాలి.

# అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం



బాగ్ అమిర్ వార్డు కార్యాలయం వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన టీ స్టాల్




వార్డు కార్యాలయానికి మరో పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన ఫాస్ట్ ఫుడ్ సెంటర్

- **బాగ్ అమీర్ వార్డు కార్యాలయం ముందే రోడ్డు ఆక్రమణ**
- **నెలరోజులుగా ఫిర్యాదు పెండింగ్**
- **ప్రభుత్వ వనరుల దుర్వినియోగంపై స్థానికుల ఆగ్రహం**

**సైబరాబాద్ -విశాల భారతి**


కూకట్‌పల్లిలోని బాల్ అమీర్ వార్డు కార్యాలయం ఎదుటే రోడ్డు, పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, టీ స్టాల్ నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసి నెల రోజులు గడిచినా "చూస్తాం.. చర్యలు తీసుకుంటాం" అనే హామీలకే పరిమితమవుతున్నారని ఆరోపిస్తున్నారు. కూకట్‌పల్లిలోని బాగ్ అమీర్ వార్డు కార్యాలయం పరిసరాల్లో రోడ్డు, కార్యాలయ పార్కింగ్ ప్రాంతాన్ని ఆక్రమించి ఓ వ్యక్తి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, టీ స్టాల్ నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయానికి చెందిన విద్యుత్, నీటి సదుపాయాలను వినియోగిస్తూ ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సమస్యపై స్థానికుడు శ్రీనివాస్ జూలై 9న జీహెచ్‌ఎంసీ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. అయితే నెల రోజులు గడిచినా ఆక్రమణ తొలగించకపోగా, సంబంధిత అధికారులు కేవలం హామీలకే పరిమితమయ్యారని స్థానికులు విమర్శిస్తున్నారు. మరోవైపు ఆన్‌లైన్‌లో ఫిర్యాదును పరిష్కరించినట్లు నమోదు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి యథాతథంగానే ఉందని పేర్కొంటున్నారు. స్థానికుల కథనం ప్రకారం, ఈ వ్యవహారంపై ఆల్విన్ కాలనీ సర్కిల్ ఉప కమిషనర్ చాముండేశ్వరి దృష్టికి కూడా పలుమార్లు తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కిల్ కార్యాలయానికి పలుమార్లు వెళ్లి వినతులు ఇచ్చినా అధికారులు కేవలం "చూస్తాం.. చర్యలు తీసుకుంటాం" అనే మాటలకే పరిమితమవుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా, కూకట్‌పల్లి సర్కిల్‌కు చెందిన ఓ శానిటేషన్ జవాన్ అక్రమ ఫాస్ట్‌ఫుడ్, టీ సెంటర్ల నిర్వాహకులకు అండగా నిలుస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ఎంటమాలజీ విభాగానికి చెందిన కొందరు సిబ్బంది కూడా ఇటువంటి అక్రమ వ్యాపారాలను అడ్డుకోవాల్సింది పోయి, దగ్గరుండి ప్రోత్సహిస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ అంశాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి విచారణ గానీ, చర్యలు గానీ కనిపించడం లేదని పేర్కొంటున్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా, ప్రభుత్వ విద్యుత్, నీటి వనరులు దుర్వినియోగం అవుతున్నా, ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయం ఎదుటే ఇలాంటి పరిస్థితి కొనసాగుతుంటే నగరంలోని ఇతర ప్రాంతాల్లో ఆక్రమణలను ఎలా అరికడతారని ప్రశ్నిస్తున్నారు. అలాగే సంబంధిత అధికారులకు, ఆక్రమణదారులకు మధ్య ఏదైనా అవగాహన ఉందా అనే అనుమానాలను కూడా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమి, పార్కింగ్ స్థలాన్ని వెంటనే ఆక్రమణ నుంచి విముక్తి చేసి, బాగ్ అమీర్ వార్డు కార్యాలయం ఎదుట కొనసాగుతున్న అక్రమ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, టీ స్టాల్‌ను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఆక్రమణలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.



ఎన్ శ్రీనివాస్ బాగ్ అమీర్ స్థానికుడు

# ఉచిత పథకాలపై హైకోర్టు సీరియస్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న ఉచిత పథకాలు అలాగే ప్రభుత్వ పాలనా తీరుపై శుక్రవారం హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఒక విచారణ సందర్భంగా జస్టిస్ నగేష్ భీమపాక సమాజంలో భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదకర పరిణామాలను ప్రస్తావించారు. కేవలం పేదలకు మాత్రమే కాకుండా కోటీశ్వరులకు కూడా సంక్షేమ పథకాలు అందుతుండటంతో ప్రభుత్వాలపై విపరీతమైన ఆర్థిక భారం పడుతోందని ధర్మాసనం స్పష్టం చేసింది. సంపన్నులు సైతం లబ్ధి పొందడం సరికాదని అన్నారు. రైతుల మేలు కోసమే ఉద్దేశించిన రైతుబంధు వంటి పథకాలు మంచివే అయినప్పటికీ అర్హుల ఎంపిక సరిగా జరగడం లేదు. దీనివల్ల ధనికులు కూడా ఉచిత సాయం పొందుతున్నారు. ప్రతిదీ ఉచితంగా లభిస్తుండటంతో ప్రజల్లో పనిచేయాలనే ఆసక్తి పూర్తిగా సన్నగిల్లుతోంది. ఈ దుస్థితి వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు కూలీలు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా అన్నదాతలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హైకోర్టు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే తరహాలో ఉచితాల సంస్కృతిని కొనసాగిస్తే చివరికి కుబేరుడి సంపద కూడా కరిగిపోతుందని కోర్టు హెచ్చరించింది. పరిస్థితి ఇలాగే ఉంటే చివరకు ధనికులు సైతం పనికి ఆహార పథకం కింద కూలీ పనులకు వెళ్లాల్సిన దయనీయమైన స్థితి వస్తుందని తెలిపారు. పౌరుల సామాజిక బాధ్యత గురించి మాట్లాడుతూ గతంలో మహనీయులను చూసి దేశానికి ఏం ఇచ్చామని ఆలోచించేవారని గుర్తుచేశారు. కానీ నేడు దేశం మనకేమి ఇచ్చిందనే స్వార్థపూరిత ధోరణి పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటీ పదిహేడు లక్షల కుటుంబాలకు ఉచిత పథకాలు అందిస్తుంటే ప్రభుత్వాలు ఆ భారీ భారాన్ని ఎలా మోయగలవని న్యాయమూర్తి ప్రశ్నించారు. రేపటి భవిష్యత్ తరాలకు మనం ఏం మిగులుస్తున్నామో ప్రతి ఒక్కరూ గంభీరంగా ఆలోచించాలని హితవు పలికారు. చదువుకునే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కూడా కేవలం అత్యంత ప్రతిభావంతులైన నిజమైన నిరుపేదలకు మాత్రమే ఆర్థిక సాయం అందించేలా నిబంధనలు మార్చాలని సూచించారు. తాను చేసిన ఈ వ్యాఖ్యలు ఏ ఒక్క రాజకీయ పార్టీ ప్రభుత్వాన్ని ఉద్దేశించినవి కావని జస్టిస్ నగేష్ భీమపాక స్పష్టం చేశారు. ఒక బాధ్యత కలిగిన పౌరుడిగా సమాజంలో రాబోయే పెను ప్రమాదాల గురించి హెచ్చరించేందుకే ఈ విశ్లేషణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాధనం వృథా కాకుండా సద్వినియోగం కావాలంటే సంక్షేమ పథకాలు కేవలం అర్హులైన నిరుపేద కుటుంబాలకు మాత్రమే అందాలి. దీనికోసం ప్రభుత్వాలు అత్యంత పారదర్శకమైన సరికొత్త విధానాలను అమలు చేయాలని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. ప్రస్తుత సమాజంలో సంక్షేమ ఫలాలు పొందుతున్న తీరుపై సమగ్రమైన పునఃసమీక్ష అవసరమని న్యాయస్థానం అభిప్రాయపడింది. నిజమైన పేదలను ఆదుకోవడం ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం కావాలని హైకోర్టు పునరుద్ఘాటించింది. అనర్హులు లబ్ధి పొందుతున్న లొసుగులను వెంటనే సరిదిద్దాలని ప్రభుత్వానికి సూచించింది. భవిష్యత్ తరాల ఆర్థిక స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకొని బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలని పిలుపునిచ్చింది. ఉచితాల వల్ల సోమతనం పెరగకుండా ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే దిశగా పాలనా విధానాలు ఉండాలని ఆకాంక్షించింది.

# ఫ్లెక్సీల ధ్వంసం పోలీసుల దర్యాప్తు

- **తూప్రాన్‌లో అర్ధరాత్రి ఘటన**
- **సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల గుర్తింపు**

**విశాలభారతి, తూప్రాన్;** తూప్రాన్ పట్టణంలో అర్ధరాత్రి ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆగస్టు 6, 7 తేదీల మధ్య అర్ధరాత్రి సమయంలో తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన రెండు ఫ్లెక్సీలతో పాటు మహంకాళి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన మరో మూడు ఫ్లెక్సీలను కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా చించి ధ్వంసం చేసినట్లు ఫిర్యాదు అందింది. ఈ ఘటనపై తూప్రాన్ పట్టణానికి చెందిన గరిగెన నర్సింహారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో ఎర్వుల సాయికుమార్‌తో పాటు మరికొందరు కలిసి ఫ్లెక్సీలను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు తూప్రాన్ పోలీసులు సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించడంతో పాటు ఇతర సాక్ష్యాధారాలను సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సీసీటీవీ దృశ్యాలు, ఇతర ఆధారాల ఆధారంగా నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. పోలీసుల హెచ్చరిక ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేయడం, ఫ్లెక్సీలు చింపివేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రజలు సంయమనం పాటించాలని సూచించారు. ఘటనకు సంబంధించి సమాచారం తెలిసిన వారు వెంటనే తూప్రాన్ పోలీసులకు తెలియజేయాలని కోరారు.




# వరంగల్, ఖమ్మంపై స్పెషల్ ఫోకస్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగరానికి దీటుగా తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ఆదేశాల మేరకు డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ వరంగల్, ఖమ్మం, కరీంనగర్ నగరాలను అనుసంధానించేలా ప్రత్యేక మాస్టర్ ప్లాన్‌ను తయారు చేస్తోంది. ఈ ప్రాంతాలలో ట్రాఫిక్ ఇబ్బందులను పూర్తిగా తొలగించి, పారిశ్రామిక రంగానికి బలమైన ఊతమిచ్చే లక్ష్యంతో హైదరాబాద్ తరహాలో ఔటర్ రింగ్ రోడ్లను నిర్మించడానికి డిపిఆర్‌లు సిద్ధం చేస్తున్నారు. ఈ గ్రోత్ క్యారిడార్ నిర్మాణ పనుల నిధుల భారం మొత్తం కేంద్ర ప్రభుత్వమే చూసుకునేలా ప్రణాళికలు రూపొందాయి. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా మొత్తం రూ. 14,000 కోట్ల భారీ నిధుల కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. తొలి విడత కింద ఐదు కీలక ప్రాజెక్టులకు రూ. 5,681.04 కోట్ల మేర భారీ ఆమోదం లభించింది. కేంద్ర ప్రభుత్వం తన మొదటి విడత వాటా కింద ఇరవై ఐదు శాతం నిధులు అంటే రూ. 1,420.26 కోట్లను ఇప్పటికే విడుదల చేయడం



విశేషం. నల్గొండ అలాగే యాదగిరిగుట్ట పవిత్ర ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేకంగా టెంపుల్ కారిడార్ ఏర్పాటు చేస్తున్నారు. ఆదిలాబాద్, నాగోబా, బాసర అలాగే కడెం ప్రాజెక్టులను అనుసంధానిస్తూ మరొక అద్భుతమైన టూరిజం కారిడార్‌ను తీసుకువస్తున్నారు. మహబూబ్‌నగర్, భూత్పూర్ అలాగే జడ్చర్ల ప్రాంతాలను కలుపుతూ మరో పారిశ్రామిక కారిడార్ రూపుదిద్దుకుంటోంది. కొత్తగూడెం, పాల్వంచ అలాగే సుజాతనగర్ ప్రాంతాలతో మరొక ఎకనామిక్ కారిడార్ రూపకల్పన వేగంగా జరుగుతోంది. వీటితో పాటు వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల పరిధిలోని సిడిఎంఎ మునిసిపాలిటీలను కేంద్రీకరించి పారిశ్రామిక, వ్యవసాయాధారిత రంగాలు, రియల్ ఎస్టేట్ రంగానికి భారీగా ఊతమిచ్చేలా ప్రత్యేక క్లస్టర్లు రూపొందుతున్నాయి. డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఈ అభివృద్ధి జోన్ల నిర్మాణానికి అనుగుణంగా ప్రత్యేక మాస్టర్ ప్లాన్లను అత్యంత వేగంగా సిద్ధం చేస్తోంది. యువతకు కొత్త ఉపాధి అవకాశాలు లభించేలా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు భవిష్యత్తులో కీలక భూమిక పోషిస్తాయని నిపుణులు నమ్ముతున్నారు. వరంగల్ అలాగే ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ల ఎన్నికలు అతి త్వరలో రానున్నాయి. సరిగ్గా ఇదే కీలక తరుణంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ గ్రోత్ క్యారిడార్ అమలుకు శ్రీకారం చుట్టడం రాజకీయ వర్గాలలో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఖమ్మం, వరంగల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ పార్టీకి, బిఆర్ఎస్ పార్టీకి మధ్య ముమ్మర పోటీ సాగుతోంది. ఈ నగరాలలో గత కాలంలో బిఆర్ఎస్ పార్టీ చాలా బలంగా ఉన్నప్పటికీ, ఇటీవలి కాలంలో నాయకుల చేరికలు అలాగే రాజకీయ సమీకరణాల మార్పుతో కాంగ్రెస్ పార్టీ తన పట్టును విపరీతంగా పెంచుకుంది. స్థానిక ఓటర్లను ఆకట్టుకోవడానికి ఈ భారీ అభివృద్ధి పథకాలు అధికార పార్టీకి ప్రధాన అస్త్రాలుగా మారే అవకాశం ఉంది. ఈ కొత్త క్యారిడార్ల అమలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమేరకు సానుకూలంగా మారుతుందో ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తాయి. నగరాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా సాగుతున్న ఈ ప్రయాణం యువతలో సరికొత్త ఆశలను రేకెత్తిస్తోంది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా ప్రభుత్వం వేస్తున్న అడుగులు అభినందనీయం. గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలను తగ్గించి, స్థానికంగానే ఉపాధి కల్పించడమే ఈ మాస్టర్ ప్లాన్ ప్రధాన ఉద్దేశం. ఐటీ రంగంతో పాటు మాన్యుఫ్యాక్చరింగ్ రంగాన్ని ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించడం ద్వారా సమతుల అభివృద్ధి సాధ్యమవుతుంది. భూముల ధరలు పెరగడంతో పాటు రియల్ ల్యాండ్ రంగం ఊపందుకుంటుందని రియల్టర్లు భావిస్తున్నారు. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణ వల్ల భవిష్యత్తులో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

# భూభారతి, సాదాబైనామా దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణి అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి
- తహసిల్దార్లతో సమీక్షలో కలెక్టర్ భవేష్ మిశ్రా
- ఆలస్యంగా హాజరైన తహసిల్దార్లకు షోకాజ్ నోటీసులు

**నిజామాబాద్ జిల్లా విశాల భారతి**



నిజామాబాద్, ఆగస్టు 07 : భూభారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమీక్ష మందిరంలో శుక్రవారం ఆయన అన్ని మండలాల తహసిల్దార్లతో భూభారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్ష జరిపారు. ఒక్కో మండలం వారీగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు ఎన్ని అని ఆరా తీస్తూ, వాటి పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన జరుపుతూ ఈ నెలాఖరులోగా అన్నింటిని పరిష్కరించాలని కలెక్టర్ గడువు విధించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని, ప్రాధాన్యత క్రమంలో దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణితో పాటు, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సీ.ఎం ప్రజావాణి కార్యక్రమాల ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారం విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరిస్తూ, వివరాలను ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. పై అంశాలకు సంబంధించి నిర్ణీత నమూనాలో రోజువారీగా తనకు వివరాలు పంపాలని ఆదేశించారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్ కోసం వచ్చిన దరఖాస్తులను కూడా సత్వరమే పరిశీలిస్తూ పరిష్కరించాలన్నారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకుని ఈ నెల 17వ తేదీ లోపు అన్ని ఎఫ్.ఆర్.సి దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలని కలెక్టర్ సూచించారు. కస్టం మిల్లింగ్ కోసం లేవీ ధాన్యం కేటాయించిన రైస్ మిల్లులను ప్రతి పక్షం రోజులకు ఒకసారి అయిన తప్పనిసరిగా సందర్శిస్తూ, ధాన్యం నిల్వలను పరిశీలించాలని తహసిల్దార్లను ఆదేశించారు. నూతన తహసిల్దార్ కార్యాలయాల నిర్మాణం కోసం ఆయా మండలాల్లో అవసరమైన స్థలాలను గుర్తిస్తూ, సమగ్ర వివరాలతో నివేదికలు పంపాలని సూచించారు.

**ఆలస్యంగా హాజరైన తహసిల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ**

ఇదిలాఉండగా, సమీక్షా సమావేశానికి ఆలస్యంగా హాజరైన తహసిల్దార్లకు కలెక్టర్ భవేష్ మిశ్రా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిర్ణీత సమయానికి కలెక్టర్ సమావేశ మందిరానికి చేరుకోగా, పలు మండలాల తహసిల్దార్లు గైర్హాజరు కావడాన్ని గమనించి వారి తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణీత సమయం అనంతరం మరో 15 నిమిషాల వరకు కూడా సమావేశం హాల్ కు చేరుకోలేకపోయిన తహసిల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రతి ఒక్కరు విధిగా సమయ పాలన పాటించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, జిల్లా రెవెన్యూ అధికారి, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ఆయా మండలాల తహసిల్దార్లు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు రూ. 20 లక్షల భీమా కల్పించాలి



**కోదాడ, విశాలభారతి:** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని కోదాడ ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పద్మశాలి సంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు గొర్రె రాజేష్ మాట్లాడుతూ.. చేనేత కార్మికులను వేధిస్తున్న జియో ట్యాగ్ నిబంధనను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులను కళాకారులుగా గుర్తించి ప్రోత్సహించాలన్నారు. మరణించిన చేనేత కార్మికుల కుటుంబాలకు రూ. 20 లక్షల భీమా పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సంగిశెట్టి గోపాల్, నక్క చంద్రం, కొంగరి నరసింహారావు, రుద్ర నాగలక్ష్మి, అనబత్తుల వేణు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## "జైల్ భరో"ను జయప్రదం చేయండి: బుర్రి శ్రీరాములు



**మునగాల, విశాలభారతి:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 10న కోదాడలో నిర్వహించనున్న దేశవ్యాప్త జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు పిలుపునిచ్చారు. శుక్రవారం చందా చంద్రయ్య అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోయి రైతులు దివాలా తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం మద్దతు ధర ఇవ్వాలని, రుణ విమోచన చట్టం చేయాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ బడ్జెట్ను తగ్గించే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం, షేక్ సైదా, మండల కమిటీ సభ్యులు డి. స్టాలిన్ రెడ్డి, వి. వెంకన్న, ఎం. వెంకటాద్రి, బి. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి నిరుద్యోగ సభను విజయవంతం చేయండి

**మునగాల, విశాలభారతి:** ఫీజు రీఇంబర్స్‌మెంట్, హాస్టల్ సమస్యల పరిష్కారం మరియు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న ఆదివారం భారాఖాతుగూడెంలో విద్యార్థి నిరుద్యోగ సభ నిర్వహిస్తున్నట్లు బీసీ సంఘాల నాయకులు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ హాజరవుతున్నారు. విలేకరుల సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు పచ్చిపాల రామకృష్ణ యాదవ్, డాక్టర్ నరాల రుక్మారావు, పోలంపల్లి సుధాకర్ గౌడ్ మాట్లాడారు. తెలంగాణలో ఫీజు బకాయిలు చెల్లించకపోవడం వల్ల ప్రైవేట్ కాలేజీలు డబ్బులు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. నిరుద్యోగులకు తక్షణమే ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కల్పించాలన్నారు. ఈ సమస్యలపై జరిగే సభకు విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా బోనాల పండుగ

**ప్రత్యేక ఆకర్షణగ నిలిచిన పోతరాజుల విన్యాసాలు**






**ఆర్మూర్ ,విశాల భారతి:** నందిపేట్ మండల కేంద్రంలోని శ్రీ గీత కాన్వెంట్ హై స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు మరియు విద్యార్థినిల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివేకానంద చౌరస్తా నుండి పాతూరు వరకు డీజే చప్పులతో కొనసాగింది. విద్యార్థుల నృత్యాలను ప్రజలు ఉత్సాహంతో తిలకించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కానూరి గంగాసాగర్ మాట్లాడుతూ ఆషాడ మాసంలో తెలంగాణ ప్రజల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతికగ నిలిచే పవిత్ర మాసమని అన్నారు. ప్రతి సంవత్సరం బోనాల పండుగ జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. బోనాలు మహాకాళి అమ్మవారికి కృతజ్ఞత సమర్పించే నైవేద్యం అని 'బోనం' అంటే భోజనం అని అర్థమని వివరించారు. తెలంగాణ సంస్కృతిని భావితరాలకు పరిచయం చేయాలని ఉద్దేశంతో పాఠశాలలో బోనాల వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కానూరి శోభారాణి, ప్రిన్సిపాల్ గంగ భూషణ్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ ధరకు గ్యాస్ సిలిండర్ అంటూ మోసాలు

**వృద్ధులను లక్ష్యంగా చేసుకుని నగదు వసూళ్లు.. ఆత్మకూర్ పోలీసుల హెచ్చరిక**



**ఆత్మకూర్(ఎం ), విశాలాభారతి :** ప్రభుత్వ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూర్ పోలీసులు హెచ్చరించారు. ప్రస్తుతం కొందరు వ్యక్తులు "ప్రభుత్వం ద్వారా కొత్త గ్యాస్ సిలిండర్లు తక్కువ ధరకు ఇప్పిస్తాం", "ప్రత్యేక ప్రభుత్వ పథకం వచ్చింది", "సర్వే కార్యక్రమం కోసం వచ్చాం" అంటూ ముఖ్యంగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుని నగదు వసూలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇలాంటి వ్యక్తుల మాటలు నమ్మి ఎట్టి పరిస్థితుల్లోనూ నగదు ఇవ్వవద్దని సూచించారు. ప్రభుత్వ పథకాల పేరుతో ఎవరైనా ఇంటింటికీ వచ్చి నగదు వసూలు చేస్తే అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఏదైనా ప్రభుత్వ పథకం గురించి సమాచారం తెలుసుకోవాలంటే సంబంధిత ప్రభుత్వ కార్యాలయం లేదా అధికారులను సంప్రదించి నిర్ధారించుకున్న తర్వాతే చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు కనిపించినా, ఎవరైనా మోసానికి పాల్పడుతున్నట్లు అనుమానం వచ్చినా వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని లేదా డయల్ 112కు ఫోన్ చేయాలని ఆత్మకూర్ పోలీసులు కోరారు. ప్రజలు ఈ విషయాన్ని తమ కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా వృద్ధులకు తెలియజేసి ఇలాంటి మోసాల బారిన పడకుండా అప్రమత్తం చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## పేదలకు భరోసాగా బి ఆర్ ఆర్ ఫౌండేషన్

**ఫౌండేషన్ సభ్యులు బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మంగ ఐలేష్ కురుమ**



**విశాల భారతి ఇబ్రహీం పట్నం:** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని దండు మైలారం గ్రామనికి చెందిన మరాఠీ మహేందర్ అనారోగ్య కారణంగా మరణించారు.ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని బి ఆర్ ఆర్ ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి, ధైర్యంగా ఉండాలని,దశదినకర్మ కు ఒక్క క్వింటాల్ బియ్యం ఆర్థికసహాయంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల మేలు కొరకు నిరంతరం బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రామ్ రెడ్డి అండగా ఉంటారని బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు మంగ ఐలేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఆర్ పౌండేషన్ బిఆర్ఎస్ పార్టీ సభ్యులు మాజీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగు చింతల లింగం, తలారి రాజు, మాజీ వార్డు మెంబెర్ సహదేవ్,బీర్ల రమేష్, ఏర్పుల శ్రీను, మహేష్, నగేష్, దామ శ్రీను, నవీన్ యాదవ్, స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బంచరాయితండలో ఘనంగా తీజ్ పండుగ ప్రారంభం



- మాలు సాదు ఆధ్వర్యంలో మేరమ్మ యాడి, సేవాభాయ్‌లకు ప్రత్యేక పూజలు
- గోధుమలు తడిపిన బంజారా మహిళలు

**కురవి విశాల భారతి**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండ గ్రామపంచాయతీలో బంజారా ప్రజల సంప్రదాయ, సాంస్కృతిక పండుగ అయిన తీజ్ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మాలు సాదు ఆధ్వర్యంలో తీజ్ పండుగ ప్రారంభ కార్యక్రమాన్ని బంజారా సంప్రదాయ పద్ధతుల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తీజ్ పండుగలో భాగంగా మేరమ్మ యాడి, సేవాభాయ్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గోధుమలను తడిపే కార్యక్రమాన్ని చేపట్టారు. బంజారా మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి పూజా కార్యక్రమంలో పాల్గొని తీజ్ పండుగకు శ్రీకారం చుట్టారు. గోధుమలు సమృద్ధిగా మొలకెత్తి పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బంజారా సమాజంలో తీజ్ పండుగకు ఎంతో ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంది. తరతరాలుగా వస్తున్న బంజారా ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ పండుగను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తారు. ముఖ్యంగా మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ పద్ధతుల్లో తీజ్ వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా మాలు సాదు మాట్లాడుతూ.. బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఆధునిక కాలంలోనూ తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలను కొనసాగిస్తూ, వాటిని భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తీజ్ పండుగ బంజారా సమాజంలో ఐక్యతను, ఆత్మీయతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. తీజ్ పండుగ ప్రారంభంతో బంచరాయి తండలో పండుగ సందడి నెలకొంది. మహిళలు, యువతులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని సంప్రదాయాలను కొనసాగించారు. గ్రామంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో తండా నాయకులు, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు. తీజ్ పండుగను ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, బంజారా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించాలని వారు పిలుపునిచ్చారు.

## విద్యార్థులు సైన్స్ కిట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**ఆక్షన్‌ఎయిడ్ ఆధ్వర్యంలో స్టెమ్ ల్యాబ్ కిట్స్ పంపిణీ**

**మోటకొండూరు, విశాలాభారతి :**




విద్యార్థులు విద్యార్థి దశ నుంచే శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆక్షన్‌ఎయిడ్ ప్రోగ్రామ్ లీడ్ డాక్టర్ ఇర్ఫాన్ అన్నారు. శుక్రవారం మోటకొండూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆక్షన్‌ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో స్టెమ్ ల్యాబ్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇర్ఫాన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే సైన్స్‌పై ఆసక్తి, అవగాహన పెంపొందించేందుకు ఆక్షన్‌ఎయిడ్ సంస్థ కృషి చేస్తోందన్నారు. సైన్స్ కిట్స్‌లోని సామగ్రిని ఉపయోగించి విద్యార్థులు నిర్వహించిన ప్రయోగాలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. విద్యార్థులు ఈ కిట్స్‌ను సద్వినియోగం చేసుకుని నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని సూచించారు. మండల విద్యాధికారి కేతిరెడ్డి రఘురామ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఆక్షన్‌ఎయిడ్ వంటి సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మోటకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిక చేసి సైన్స్ కిట్స్ అందించడం సంతోషకరమని తెలిపారు. విద్యార్థులు వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకుని ప్రయోగాత్మక విద్యను అభ్యసించాలని కోరారు. ఆక్షన్‌ఎయిడ్ జిల్లా కోఆర్డినేటర్ సురపంగ శివలింగం కార్యక్రమాన్ని సమన్వయం చేయగా, ఆక్షన్‌ఎయిడ్ ప్రతినిధి ఫణీంద్ర ప్రసంగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజా గోపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, భాగ్యశ్రీ, విశ్వరూపం, రాజశేఖర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషక ఆహారం సిడిపిఓ వినీత దేవి

**విశాల భారతి ఇబ్రహీంపట్నం:** ఐ సి డి ఎస్ ఇబ్రహీంపట్నం ప్రాజెక్టు, యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల సమావేశానికి ముఖ్య అతిథిగా సిడిపిఓ వినీత దేవి హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్రతి శిశువుకు తొలి ఆరు నెలలు పల్లి పాలు ఇవ్వడం వల్ల సంపూర్ణ పోషకాహారం అందుతుందని, శిశువుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లి పాలు ఎంతో ప్రాముఖ్యతని అన్నారు. తల్లి పాల ద్వారా రోగ నిరోధక శక్తి పెరిగి అనేక వ్యాధుల నుండి శిశువులకు రక్షణ లభిస్తుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు, శిశు చిన్నారుల పోషణ పద్ధతులపై అవగాహన కల్పించారు. పిల్లల మహిళల ఆరోగ్య సంక్షేమానికి వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. తల్లిపాలు శిశువుకు తప్పని సరిగా అందించాలని పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ జెనిగే శ్రీశైలం, వార్డు సభ్యులు విజేత చంద్రకాంత్, బీరప్ప, సంధ్య నాగరాజు, హరి, కరోబార్ మహేందర్, అంగన్వాడీ టీచర్స్ అండాలు, సువర్ణ, సుజాత,వసంత, జె సి డి ఎస్ సూపర్వైజర్ సరళ, ఆశా వర్కర్స్ సైదమ్మ, గర్భిణీలు, బాలింతలు మహిళలు పాల్గొన్నారు.



## జిల్లా కోర్టు బార్ అసోసియేషన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ క్రీడల ప్రారంభం



**జనగామ జిల్లా విశాల భారతి :** కోర్టు బార్ అసోసియేషన్ హాల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించే క్రీడా పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి ప్రతిమ గారు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. దయాకర్ రెడ్డి, కార్యదర్శి మన్నె సత్తయ్య, ఎం. రవీందర్, ఏకల స్వప్న, అల్లె బాలరాజ్, రెడ్డబోయిన రాజు, ఎస్. పవన్, నాగభూషణ్ అడ్వకేట్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న క్రీడా పోటీలను విజయవంతం చేయాలని పాల్గొన్న న్యాయవాదులు ఆకాంక్షించారు.

## జిల్లా మేరు సంఘం సమావేశం విజయవంతం

**ఘనంగా శ్రీ సరస్వతి పూజ గూడూరులో ..**



**జనగామ జిల్లా విశాల భారతి :** గూడూరు గ్రామంలో జిల్లా మేరు సంఘం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సరస్వతి దేవి పూజను శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేరు సంఘం సమావేశాన్ని కూడా విజయవంతంగా నిర్వహించి, సంఘ అభివృద్ధి, ఐక్యతకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఇటీవల అకాల మరణం చెందిన గూడూరు గ్రామానికి చెందిన కీర్తిశేషులు బుచ్చమ్మ గారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా, మండల, గ్రామ మేరు సంఘం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మరిపెడ కాంగ్రెస్‌కు కొత్త సారథులు

**మండల అధ్యక్షుడిగా గుగులోతు రవి నాయక్.. టౌన్ అధ్యక్షుడిగా పానుగోతు రామ్‌లాల్**




**మరిపెడ, విశాల భారతి:** మరిపెడ కాంగ్రెస్ పార్టీకి కొత్త నాయకత్వాన్ని పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా గుగులోతు రవి నాయక్‌ను, టౌన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పానుగోతు రామ్‌లాల్‌ను నియమించింది. ఈ నియామకాలతో మండలంలో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తూ కార్యకర్తలతో సన్నిహితంగా ఉంటున్న గుగులోతు రవి నాయక్‌కు మండల పార్టీ పగ్గాలు అప్పగించగా, టౌన్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు పానుగోతు రామ్‌లాల్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇద్దరూ పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన నాయకులేనని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా గుగులోతు రవి నాయక్, పానుగోతు రామ్‌లాల్ మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగడంతో పాటు గ్రామాలు, పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు.ఇద్దరి నియామకాన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వాగతిస్తూ అభినందనలు తెలిపారు. వారి నాయకత్వంలో మరిపెడ మండలంతో పాటు టౌన్‌లో కూడా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పిల్లలతో గడిపే క్షణాలే నిలిచిపోతాయి: కేశినేని శ్రీదేవి




**కోదాడ, విశాలభారతి:** పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే అతిపెద్ద బహుమతి వారితో గడిపే సమయమేనని ఎస్ఆర్ఎం సంకల్ప్ స్కూల్ చైర్‌పర్సన్ కేశినేని శ్రీదేవి అన్నారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన 'పేరెంట్, చైల్డ్ ఫన్ స్పోర్ట్స్' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లల్లో పెరుగుతున్న మొబైల్, సోషల్ మీడియా వ్యసనాన్ని తగ్గించి, కుటుంబ బంధాలను బలోపేతం చేయడమే ఈ ఆటల ముఖ్య ఉద్దేశం అన్నారు.గెలుపోటముల కంటే పిల్లలతో కలిసి ఆనందంగా గడపడమే ముఖ్యమని, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. అనంతరం ఆటల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అర్బన్ అభివృద్ధి పనుల ప్రతిపాదనలు అందజేత

**కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి:** నిజామాబాద్ నగరంలోని పలు రోడ్ల వంతెనల అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి శుక్రవారం కేంద్ర రోడ్లు మరియు జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ప్రతిపాదనలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని దేవీ రోడ్డు,రైల్వే స్టేషన్, నాందేవాడ అడవప్ప వంతెన (ఆర్ వో బీ) మంజూరుచేయాలని కోరడం జరిగిందన్నారు. అలాగే సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎల్లమ్మగుట్ట వద్ద ఆర్ యూబీ ఏర్పాటు చేయడం అత్యంత అవశ్యకమన్నారు. ఇందుకోసం రెండింటికి కలిపి రూ.170 కోట్లు మంజూరుకావాలన్నారు. అలాగే నిజామాబాదులోని రేడియో స్టేషన్ నుంచి ముదక్ పల్లి పాత జిపి ఆఫీస్ వరకు రూ.30 కోట్లతో ఆర్ అండ్ బీ రోడ్డు కోసం ప్రతిపాదించడం జరిగిందన్నారు. వర్ని జంక్షన్ నుంచి నిజామాబాద్, డిచ్పల్లి, ఇందల్వాయి, భీమ్గల్ మీదుగా కమ్మర్పల్లి వరకు నగరాన్ని కలుపుతూ 107 కిలోమీటర్ల పొడవుతో కొత్త జాతీయ రహదారి ప్రతిపాదనను కూడా అందజేశామన్నారు. మరోక రోడ్డు నగరంలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి ఎన్టీఆర్ విగ్రహం,దుబ్బ మీదుగా కాలూర్ రోడ్డు ను పూర్తి చేయాలని కోరడం జరిగిందన్నారు. ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి అభయ్ పాటిల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఉన్నారు.

# నర్సింహులపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బొబ్బ సోమిరెడ్డి



**డోర్నకల్ ,విశాల భారతి:** నర్సింహులపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు బొబ్బ సోమిరెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. పార్టీ కష్టకాలంలోనూ కాంగ్రెస్ జెండాను వీడకుండా, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసిన ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించింది.పార్టీ పట్ల విధేయత, కార్యకర్తలతో సత్సంబంధాలు, ప్రజలతో నిరంతర అనుబంధాన్ని గుర్తించి అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ కార్యక్రమాల నిర్వహణలో చురుకుగా పాల్గొంటూ, క్లిష్ట పరిస్థితుల్లోనూ పార్టీకి అండగా నిలిచిన నాయకుడిగా బొబ్బ సోమిరెడ్డికి గుర్తింపు ఉందని పేర్కొన్నారు.ఆయన నియామకంపై మండల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# మాక్లూర్ మండలంలో 8 గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నిక



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి:** మాక్లూర్ మండలంలోని 8 గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ గ్రామాల్లో అధ్యక్షుల ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నుకో బడినట్లు తెలిపారు. మాక్లూర్ మండల అధ్యక్షుడు దయాకర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించా రు. శుక్రవారం రోజున కాంగ్రెస్ పార్టీ గ్రామాల వారిగా మొదటగా కొత్తపల్లి గ్రామం గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా పోశెట్టి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుండబి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు హరీష్,డిక్రి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గంగాధర్, వల్లభాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మోహన్, గొట్టుముక్కుల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాము,మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు శంకర్,మాం దాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అల్లరి భోజన్న,ధర్మారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సాయిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంగాధర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్ రావు, మాక్లూర్ సొసైటీ చైర్మన్ బూరుల అశోక్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీను, కొత్తపల్లి గ్రామ సర్పంచ్ భరత్, 1స్రాంచ్ భూమన్న, మాక్లూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, మాక్లూర్ ఉప సర్పంచ్ సంఘం అధ్యక్షుడు సతీష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పురుషోత్తం,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**ఆర్మూర్,విశాల భారతి:** పరిసరాలను పరిశుభ్రం గా ఉంచుకోకపోవడం వలన దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని మామిడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంఎల్ హెచ్ పి సతీష్ తెలిపారు. నందిపేట మండలం ఉమ్మేడ గ్రామంలో శుక్రవారం డ్రైడేపై కార్యక్రమం చేపట్టారు. నీటి నిల్వ ఉన్న కుండీలను ఖాళీ చేశారు. నీటి ట్యాంకులు మరియు డ్రమ్ములను మూతలతో భద్రంగా కప్పి ఉంచుకోవాలని సూచించారు. చెత్తా చెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామ పంచాయతీ ఏర్పాటుచేసిన ట్రాక్టర్లలో వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ ఎం కొండూరు మీనా పాల్గొన్నారు.

# నిషేధిత గడ్డి మందు విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలి: ఎల్ హెచ్ పీఎస్



**మరిపెడ, విశాల భారతి:** నిషేధిత గడ్డి మందు విక్రయించడం వల్ల జరుపుల అక్షిత్ ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడని, బాధ్యులైన ఫెర్టిలైజర్ షాప్ యజమాని, సంబంధిత అధికారులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్ హెచ్ పీఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు భూక్య రామ్మూర్తి నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అక్షిత్‌కు ఏదైనా అపాయం జరిగితే పూర్తి బాధ్యత షాప్ యజమాని, అధికారులదేనని అన్నారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించాలని, లేదంటే సంఘం ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో తేజావత్ మోహన్ నాయక్, గుగులోతు కవిత, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల ఫిర్యాదులతో అట్రాసిటీ కేసు

**రూపారెడ్డికి రిమాండ్**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో మణికొండకు చెందిన బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు రూపారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీస్) చట్టం కింద కేసు నమోదు చేసి పోలీసులు అరెస్ట్ చేశారు. అదనంగా ఆమెపై మూడు చీటింగ్ కేసులు కూడా నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, రూపారెడ్డి సాధారణ ప్రజలు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన చిన్న వ్యాపారులు మరియు నిరుపేదల నుంచి అధిక వడ్డీ ఆశ చూపించి భారీ మొత్తంలో డబ్బులు సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పలువురు బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదులు నమోదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేసిన బాధితులు ఇటీవల మణికొండలోని ఆమె నివాసం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. బాధితులు తమకు న్యాయం చేయాలని, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్య పోలీసులు చర్యలు చేపట్టి రూపారెడ్డిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. అనంతరం కోర్టు ఆమెకు 14 రోజుల రిమాండ్ తరలించారు.

# అక్రమ సెల్లార్ తవ్వకాలపై ఉక్కుపాదం ఎప్పుడూ..?





- అనుమతులు లేకుండానే భారీ తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి, ప్రజలకు నిద్రలేని రాత్రులు
- రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగోల్ సర్కిల్-11లో మదర్ డైరీ సమీపంలో కమర్షియల్ భవన నిర్మాణం పేరుతో నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమంగా సెల్లార్ తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ శాఖ నుంచి అవసరమైన అనుమతులు లేకుండానే భారీ యంత్రాలతో భూమిని లోతుగా తవ్వుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. భవన నిర్మాణానికి అనుమతులు పొందినప్పటికీ సెల్లార్ తవ్వకాల కోసం అవసరమైన ప్రత్యేక అనుమతులు తీసుకోకుండా భారీ స్థాయిలో తవ్వకాలు నిర్వహిస్తున్నారని పేర్కొంటున్నారు. దీంతో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించబడటమే కాకుండా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి కూడా గండి పడుతోందని ఆరోపిస్తున్నారు. భారీ యంత్రాలతో రాళ్లను పగులగొడుతూ పగలు, రాత్రి తేడా లేకుండా తవ్వకాలు కొనసాగిస్తున్నారని, దీంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర శబ్ద కాలుష్యం, దుమ్ముతో కూడిన వాయు కాలుష్యం ఏర్పడి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు, విద్యార్థులు, ఉద్యోగులు విశ్రాంతి తీసుకోలేని పరిస్థితి ఏర్పడిందని, శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు.అంతేకాకుండా భారీ తవ్వకాల కారణంగా సమీప భవనాల భద్రతపై కూడా ఆందోళనలు నెలకొన్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ప్రజాధనానికి నష్టం కలిగించే విధంగా, ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా పనులు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా హయత్‌నగర్ మండల రెవెన్యూ అధికారులు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, నాగోల్ సర్కిల్ అధికార యంత్రాంగం సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సెల్లార్ తవ్వకాలకు అవసరమైన అన్ని అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని ప్రజలకు వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నట్లు తేలితే సంబంధిత నిర్మాణ సంస్థపై మున్సిపల్, రెవెన్యూ చట్టాల ప్రకారం భారీ జరిమానాలు విధించి, అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ప్రజల ప్రాణ భద్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ అక్రమ సెల్లార్ తవ్వకాలపై రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



**సర్పంచ్ మంజుల దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**

**చౌటుప్పల్ విశాల భారతి**

ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుండి 7 వరకు జరుపుకునే ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సర్పంచ్ల ఫోరం జిల్లా మహిళా అధ్యక్షురాలు టేకుల మంజుల దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, తల్లులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంజుల రెడ్డి మాట్లాడుతూ, "తల్లి పాలలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుంది. డెలివరీ అయిన గంటలోపే ప్రతి తల్లి బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలి. పుట్టిన తర్వాత ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలనే ఇవ్వాలి. అలా చేయడం వల్ల తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారు" అని తెలిపారు.ఆరు నెలలు దాటిన తర్వాత అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం ఎంతో అవసరమని ఆమె అన్నారు. "పాలు, గుడ్లు, పప్పన్నం, ఆకు కూరలు, కూరగాయలు, అమృత ఆహారం వంటి పౌష్టికాహారాన్ని అందరూ తల్లులు తమ పిల్లలకు అందించాలి. సంపూర్ణ పోషణతోనే బలమైన తరం నిర్మితమవుతుంది" అని సూచించారు. కార్యక్రమం ముగింపులో సర్పంచ్ మంజుల రెడ్డి గారి చేతుల మీదుగా పాఠశాల పిల్లలకు యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ సుమిత్ర పెద్దిరెడ్డి, భూతం లింగస్వామి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు అరుణ, అంగన్వాడి టీచర్ అమృత, ఆశా వర్కర్ దివ్యశ్రీ తో పాటు గ్రామ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ట్రైబ్స్‌కు చట్టాల పట్ల అవగాహన ఉండాలి



- విద్యార్థి దశలోనే పూర్తి పరిజ్ఞానం అవసరం
- తొర్రూర్ ప్యానల్ కమిటీ సభ్యుడు అడ్వకేట్ సైదులు

**మరిపెడ,విశాల భారతి:**

ట్రైబల్ ప్రజలు కేంద్ర, రాష్ట్రానికి సంబంధించిన ట్రైబల్ చట్టాలు, పథకాలపై అవగాహన కలిగి ఉండాలని, మహబూబాబాద్ జిల్లాలో దాదాపు 60శాతం ప్రజలు గిరిజన, కొయ జాతి ప్రజలు ఉన్నారని వారి పిల్లలకు విద్యార్థి దశలోనే అవగాహన కల్పించేందుకు న్యాయసేవాధికార సంస్థ కృషి చేస్తుందని తొర్రూర్ ప్యానల్ కమిటీ సభ్యుడు అడ్వకేట్ తౌనుకూరి సైదులు అన్నారు. శుక్రవారం ఆయన మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ సైదులు మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన ప్రజానికమైన ట్రైబల్స్ ఎన్నో ఏళ్లుగా బాహ్యప్రపంచానికి దూరంగా, అటవీ ప్రాంతంలో ఆవాసం ఏర్పరుచుకని ఉన్నారన్నారు. అలాంటి ట్రైబ్స్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు చట్టాలు, పథకాలు రూపొందించి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నాయన్నారు. ప్రజలకు ఎలాంటి అన్యాయం జరిగినా న్యాయశాఖ వారికి ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని, వారి కోసం ఏర్పాటు చేసిన చట్టాలను తెలుసుకుని కోర్టులను ఆశ్రయిస్తే వారికి న్యాయం చేకూరుతుందన్నారు. అదే విధంగా విద్యకు దూరమైన గిరిజన, కోయ, వెనుకబడిన తరగతుల ప్రజలకోసం కూడా 2009లో కేంద్రం విద్యా యాక్ట్ తీసుకుని వచ్చి బడీడు పిల్లలు తప్పనిసరిగా బడికి పంపాలని చట్టం తీసుకురావటం జరిగిందన్నారు. అదే విధంగా సాంకేతికత, పట్టణ నాగరికతకు దూరంగా ఉన్న ట్రైబ్స్ కోసం పీఎం ఆవాస్ యోజన, పీఎం కుసుమ్ యోజన, ఉపాధి తదితర పథకాలను తీసుకురావటం జరిగిందన్నారు. సమాజంలోని మంచి, చెడుల నిర్ధారణ చట్టాల పట్ల అవగాహన విద్యార్థి దశ నుంచే కలిగి ఉండటం కీలకమని, తద్వారా దేశంలో నేరాల సంఖ్య అదుపులోకి వస్తుందన్నారు. ఈ కార్యకమంలో ప్రిన్సిపల్ రామ్ మోహన్, వైస్ ప్రిన్సిపల్ రాజ్ కుమార్, ఉపాధ్యాయులు జీ. ఉపేందర్, బి. భావ్ సింగ్, ఏ. నరేష్, బీ. వీరన్న, పీఈటీ ప్రభు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రత, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలే కీలకం

**దామెర ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు**

**విశాల భారతి / పరకాల;** ప్రజల భద్రతను మరింత పటిష్ఠం చేయడం, నేరాల నియంత్రణను సమర్థవంతంగా నిర్వహించడం లక్ష్యంగా దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్, తక్కళ్లపాడ్, కౌకొండ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టడం అభినందనీయమని దామెర ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నివారణ, నేరస్థుల గుర్తింపు, రహదారి ప్రమాదాల దర్యాప్తు, ప్రజల భద్రత పరిరక్షణలో పోలీసులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతి గ్రామంలోని 2 ప్రధాన కూడళ్లు, ముఖ్య రహదారులు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని కౌకొండ గ్రామ సర్పంచ్ ఓదెల శ్రీలత-భాస్కర్, ఉపసర్పంచ్ ముక్కెర రాజు సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.50,000 విరాళం అందజేశారు. అలాగే తక్కళ్లపాడ్ గ్రామ సర్పంచ్ వసంత రమేష్ రూ.27,000 విలువైన సీసీ కెమెరాలను అందించారు. వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ పంచగిరి రాజు, ఉపసర్పంచ్ గోల్కొండ రమేష్ రూ.25,000 విరాళం అందించారు.

# జూనియర్ సివిల్ కోర్టు నూతన జడ్జికి ఘన స్వాగతం

**పూల మొక్కతో శుభాకాంక్షలు తెలిపిన వాకిటి నరసింహారెడ్డి**



**చౌటుప్పల్ విశాల భారతి:** చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టుకు నూతనంగా నియమితులైన జూనియర్ సివిల్ జడ్జి శాలిని గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి శాలినిని చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నర్సింహా రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్కను అందజేసి, ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల పరమేష్, శ్రీకాంత్ లు ఉన్నారు.

# కాంగ్రెస్‌కు మరో షాక్.. బీఆర్ఎస్‌లోకి సీనియర్ నాయకుడు



**కురవి విశాల భారతి:** కురవి మండలం హరిదాస్ తండాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బోడ సక్రాం నాయక్ కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఉగ్గంపల్లిలో జరిగిన కార్యక్రమంలో డోర్నకల్ మాజీ శాసనసభ్యులు డీఎస్ రెడ్యా నాయక్ సమక్షంలో ఆయన బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా సక్రాం నాయక్‌తో పాటు పలువురు నాయకులు, గ్రామ ప్రముఖులు మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్‌ను కలసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుండాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ చేరికతో హరిదాస్ తండాలో బీఆర్ఎస్‌కు మరింత బలం చేకూరిందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు బీఆర్ఎస్‌లో చేరడం స్థానికంగా రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్య శోభన్ బాబు, ఇస్లావత్ రాజు, భూక్య లలితా ప్రసాద్, బానోతు రమేష్, బానోతు వీరన్న, ధరావత్ వెంకన్న, సుందర్‌లాల్, భూక్య సుమన్, భూక్య అనిల్, భూక్య రవి, గుగులోత్ ప్రసాద్తో పాటు హరిదాస్ తండా గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు



**విశాల భారతి, పెద్దపల్లి :** సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రెషర్స్ డే కార్యక్రమంలో శుక్రవారం రోజున ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ.పెద్దపల్లి నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికీ రూ.50 కోట్లు కేటాయించారు.నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో సుల్తానాబాద్ లో నెలకొల్పుతున్నట్టు చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి ఇది ప్రారంభమవుతుందన్నారు. ఉన్నత స్థాయి విద్యా ప్రమాణాలతో నర్సరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఇందులో విద్యాభ్యాసం ఉంటుందన్నారు. జూనియర్ కాలేజ్ విద్యార్థులకు ప్రభుత్వ ప్రకారం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. సుల్తానాబాద్ ప్రభుత్వ కాలేజీలో చదివిన వారు ఎంతో ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. తాను కూడా ఇదే కళాశాలలో చదవడం గర్వంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థిగా కళాశాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కాలేజీని మంచి ఫలితాలతో క్రమశిక్షణతో నడుపుతున్న ప్రిన్సిపాల్ ను, అధ్యాపకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్,బిరుదు కృష్ణ,జిల్లా లైబ్రరీ చైర్మన్,అంతటి అన్నయ్య గౌడ్,మున్సిపల్, వైస్ చైర్మన్,పుష్పలత కమిషనర్, కౌన్సిలర్లు మరియు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు , స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు రవీందర్ మరియు కాంగ్రెస్ నాయకులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పోచారం గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల అవగాహన ర్యాలీ

**విశాల భారతి /పరకాల ;** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా పరకాల మండలం పోచారం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. సూపర్వైజర్ జె. రాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మధుకర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు పుష్పలత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జననం అయిన గంటలోపు ముర్రుపాలు ఇవ్వడం, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే అందించడం, అనంతరం అదనపు ఆహారంతో పాటు తల్లిపాలు కొనసాగించడం వల్ల శిశువుల ఆరోగ్యం మెరుగుపడుతుందని తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, గర్భిణీలు, బాలింతలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ప్రచారం కోసం ప్రాణాలతో ఆట!

- ది ఫిట్ నేషన్ హైదరాబాద్' వార్షికోత్సవం పేరుతో రోడ్డుకు అడ్డంగా అక్రమ ఫ్లెక్సీలు..
- జీహెచ్ఎంసీ అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారని ఆరోపణలు
- వెంటనే తొలగించి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగోల్ సర్కిల్-11, కుంట్లూర్ డివిజన్ క్రాస్‌రోడ్ వద్ద రహదారికి అడ్డంగా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. 'ది ఫిట్ నేషన్ హైదరాబాద్' తొలి వార్షికోత్సవం ఈ నెల 20న నిర్వహించనున్న నేపథ్యంలో ప్రచారం పేరుతో జీహెచ్ఎంసీ అనుమతులు లేకుండానే రహదారికి ఇరువైపులా, చౌరస్తాలు, మూలమలుపుల వద్ద భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీల వల్ల వాహనదారుల దృష్టి మరలిపోతుండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే పరిస్థితులు నెలకొంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కుంట్లూర్ క్రాస్‌రోడ్ వద్ద నిత్యం భారీగా ట్రాఫిక్ ఉండటంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోరిక్షాలు, కార్లు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని చెబుతున్నారు. రాత్రి వేళల్లో, వర్షాకాలంలో ఈ ఫ్లెక్సీలు మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని, ఎప్పుడైనా ఘోర రోడ్డు ప్రమాదం సంభవించే పరిస్థితులు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. సాధారణ ప్రజలు చిన్న నిబంధన ఉల్లంఘించినా వెంటనే జరిమానాలు విధించే జీహెచ్ఎంసీ అధికారులు, ఇలాంటి భారీ అక్రమ ఫ్లెక్సీల విషయంలో మాత్రం ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ప్రాణ భద్రత కంటే ప్రచారానికే ప్రాధాన్యం ఇవ్వడం బాధ్యతారాహిత్యమని మండిపడుతున్నారు. ఇప్పటికైనా నాగోల్ సర్కిల్-11 డిప్యూటీ కమిషనర్ తక్షణమే స్పందించి రహదారులకు అడ్డంగా ఏర్పాటు చేసిన అన్ని అక్రమ ఫ్లెక్సీలు, హోర్డింగ్స్‌ను వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే 'ది ఫిట్ నేషన్ హైదరాబాద్' నిర్వాహకులు జీహెచ్ఎంసీ అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఉంటే మున్సిపల్ చట్టాల ప్రకారం భారీ జరిమానా విధించి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇకపై రహదారులపై ఎలాంటి అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే వారిపై రాజీ లేకుండా చర్యలు తీసుకుని ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో భవిష్యత్తులో జరిగే ప్రమాదాలకు సంబంధిత అధికారులు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## తెలంగాణ సాంస్కృతి.. బోనాల పండుగ

**ఎల్ఎన్ఆర్ స్కూల్ చైర్మన్ డాక్టర్ వి.సునీత**



**మొయినాబాద్:(విశాలభారతి):** తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని, అందులో భాగంగా ఆషాడ మాసంలో బోనాల పండుగ అంగరంగ వైభవంగా జరుపుకోవడం మనందరి అదృష్టమని చిలుకూరులోని ఎల్ఎన్ఆర్ పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.సునీత, డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్ లు పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు సమీపంలో ఎల్ఎన్ఆర్ పాఠశాలలో బోనాల సంబరాల ఉత్సవాలను చైర్మన్ సునీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషాలు వేసి బోనాలు ఎత్తుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆటపాటలు చిన్నారుల నృత్యాలు, పోతురాజుల నృత్యాలు, యాప కొమ్మల ఆటలతో పాఠశాల ఆవరణ బోనాల సంబరాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆషాడ మాసంలో తెలంగాణ ప్రజలు గ్రామాలలో ఉన్న దేవతలకు నైవేద్యంగా బోనాలు సమర్పించడం ప్రతి సంవత్సరం జరుగుతుందని పేర్కొన్నారు. సనాతన ధర్మం ప్రజల్లో కొనసాగినప్పుడే సాంస్కృతి సాంప్రదాయాలు కట్టుబొట్టు పిల్లలకు నేర్పించిన వారవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**విశాల భారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా లెక్చరర్స్ కాలనీ డివిజన్ చేనేత సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నేతన్నలకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామ్ చరణ్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. నేతన్నల సంక్షేమం, చేనేత రంగ అభివృద్ధి, వారి ఆర్థిక భద్రత కోసం ప్రభుత్వం పలు సంక్షేమ, ప్రోత్సాహక కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. చేనేత కార్మికులు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చేనేత పరిశ్రమ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఈ రంగాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. నేతన్నల కృషిని సమాజం గుర్తించి చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భావన ఋషి దేవ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు తాటి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి తిరందాసు నరసింహ, డైరెక్టర్లు విజయలక్ష్మి, వడిచర్ల సుదర్శన్, గదాస్ బాలయ్య, సంగిశెట్టి కృష్ణయ్య, వంగరి సత్యనారాయణ, రామకోటి, గోశిక నరసింహ, పాపని వీరేశం, నామని నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## నిరాధార ఆరోపణలు మానాలి

**కౌన్సిలర్ మహేష్ ఆధారాలుంటే ప్రజల ముందుంచాలని సవాల్**



**మొయినాబాద్, ఆగస్టు 7(విశాలభారతి):** తనపై డబ్బులు తీసుకున్నారంటూ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని మొయినాబాద్ మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ మహేష్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అప్పట్లో గ్రామపంచాయతీ పాలకవర్గమే రోడ్లను పగులగొట్టిందని, ఇప్పుడు అదే విషయంపై తనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గ్రామంలో జరిగిన పనుల గురించి ప్రజలకు పూర్తి అవగాహన ఉందని, వాస్తవాలను పక్కనబెట్టి రాజకీయ విమర్శలు చేయడం బాధ్యతాయుతమైన నాయకుల లక్షణం కాదని పేర్కొన్నారు.తాను డబ్బులు తీసుకున్నానని ఆరోపిస్తున్న వారు అందుకు సంబంధించిన ఆధారాలను బహిరంగంగా చూపించాలని సవాల్ విసిరారు. ఆధారాలు లేకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయవద్దని సూచించారు.గతంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులుగా ఉన్నవారే గ్రామంలో డ్రైనేజీ సమస్యలకు కారణమయ్యారని ఆరోపించిన ఆయన, ఆ విషయాలను విస్మరించి ఇప్పుడు విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపైనే తన దృష్టి ఉంటుందని, వ్యక్తిగత విమర్శల కంటే అభివృద్ధి అంశాలపై చర్చించడం మంచిదని పేర్కొన్నారు.

## చేరదీసే వారు లేక..

**వృద్ధుడిని ఆశ్రమానికి చేర్చిన చిలకలగూడ పోలీసులు**



**సికింద్రాబాద్, విశాల భారతి:** దిక్కులేని స్థితిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక వృద్ధుడికి చిలకలగూడ పోలీసులు ఆపద్బాంధవుడిగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఆయన పేరు ఎల్లయ్య (70). స్వగ్రామం సిద్దిపేట జిల్లా చేర్యాల అని పేర్కొన్నాడు. గత మూడు రోజుల క్రితం కుడి కాలికి తీవ్ర గాయంతో కనిపించిన ఎల్లయ్యను పోలీసులు చేర్పించి వైద్య చికిత్స అందించారు. అయితే చికిత్స పూర్తయిన తర్వాత కూడా ఆయనను తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు గానీ, బంధువులు గానీ ఎవరూ రాకపోవడంతో చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ వి. రామకృష్ణ స్పందించారు. ఆయన చొరవతో వృద్ధుడిని హైదరాబాద్‌లోని మదర్ తెరిసా ఆశ్రమానికి తరలించే ఏర్పాటు చేశారు. ఎస్ఐ చంద్రయ్య, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, ఉదయభాస్కర్ బాధితుడిని సురక్షితంగా ఆశ్రమానికి చేర్పించారు. దిక్కులేని వృద్ధుడికి అండగా నిలిచిన పోలీసుల మానవతా దృక్పథాన్ని పలువురు కొనియాడారు.

## చైన్‌స్నాచర్ల చాపకింద నీరుకు చెక్..!



- ముగ్గురు అంతర్రాష్ట్ర నేరస్థులు అరెస్ట్
- రెండు బంగారు మంగళసూత్రాలు, చోరీ బైక్, మొబైల్ స్వాధీనం

**విశాల భారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :** నగరంలో మహిళలను లక్ష్యంగా చేసుకుని వరుస చైన్‌స్నాచింగ్‌లు, వాహన చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్రాష్ట్ర నేరస్థులను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేసి కీలక విజయాన్ని నమోదు చేశారు. నిందితుల వద్ద నుంచి రెండు బంగారు మంగళసూత్రాలు, చోరీ చేసిన బజాజ్ పల్సర్ మోటార్‌సైకిల్, నేరాలకు ఉపయోగించిన ఓపో మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు నాగోల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ వెల్లడించారు. ఇన్స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రంలోని సమస్తిపూర్ జిల్లాకు చెందిన అంషు కుమార్ (26), సరోజ్ కుమార్ (23), విక్రమ్ కుమార్ (23) కూలీ పనుల కోసం ఇటీవల హైదరాబాద్‌కు వచ్చి యాకుత్‌పురా ప్రాంతంలో నివాసముంటున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో ముగ్గురూ కలిసి చైన్‌స్నాచింగ్‌లు, వాహన చోరీలకు పాల్పడాలని పథకం రచించారు. ఈ క్రమంలో ఆగస్టు 3న మేడ్చల్‌లోని వెల్లమ్మతోట కాలనీ నుంచి ఓ బజాజ్ పల్సర్ మోటార్‌సైకిల్‌ను చోరీ చేశారు. అనంతరం అదే బైక్‌పై తిరుగుతూ ఆగస్టు 4న నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తట్టి అన్నారం ఆర్.కే.నగర్ ప్రాంతంలో ఓ మహిళ మెడలోని బంగారు మంగళసూత్రాన్ని అపహరించారు. అనంతరం ఆగస్టు 6న యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామంలో మరో మహిళ మెడలోని సుమారు ఐదు తులాల బంగారు మంగళసూత్రాన్ని లాక్కెళ్లినట్లు విచారణలో తేలిందన్నారు. ఆగస్టు 7న ఆనంద్‌నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద నాగోల్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా, పలు చైన్‌స్నాచింగ్‌లు, వాహన చోరీ కేసుల్లో తమ ప్రమేయాన్ని అంగీకరించినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. దీంతో కేసులను ఛేదించి నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితుల వద్ద నుంచి రెండు బంగారు మంగళసూత్రాలు (మొత్తం ఐదు తులాలు), ఒక బజాజ్ పల్సర్ మోటార్‌సైకిల్, నేరాలకు ఉపయోగించిన ఓపో మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన సీసీఎస్ ఎల్‌బీనగర్ ఇన్స్పెక్టర్ గోవింద్, సరూర్‌నగర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శేఖర్, వారి సిబ్బందితో పాటు నాగోల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ, సిబ్బంది సుభాష్, సాయి, లింగస్వామి, జగన్లను ఎల్‌బీనగర్ డీసీపీ డాక్టర్ అనురాధ, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించినట్లు ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయంలో విలువైన బంగారు ఆభరణాలను బహిరంగంగా ధరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు సమాచారం ఇవ్వాలని ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ సూచించారు.

## జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి




**డి కిషన్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు**

**విశాల భారతి ఇబ్రహీంపట్నం**

కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా దేశ సంపదను కట్టబెడుతున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నాటి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ పెట్టుబడిదారులకు మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో 2026 ఆగస్టు 10వ తేదీన రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మిక వర్గం పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని కోరుతూ జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తొర్రూర్,తుర్కయంజాల్ డివిజన్లో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సిఐటియు ఆధ్వర్యంలో విస్తృతంగా కరపత్రాలు పంపిణీ చేశారు.అనంతరం సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి కిషన్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నయా ఉదారవాద సంస్కరణలను దుందుడుకుగా అమలు చేస్తున్నదని, అందులో భాగంగానే కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తొలగించి వాటి స్థానంలో పెట్టుబడుదారులకు కార్పొరేట్లకు, పరిశ్రమల యాజమాన్యాలకు అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్లను అమలు చేసేందుకు ఫైనల్ రూల్స్ ను నోటిఫై చేసిందని విద్యుత్ సవరణ బిల్లు 2025, విత్తన చట్టానికి సవరణలు ప్రతిపాదించిందని సులభతర వ్యాపారం పేరుతో పెట్టుబడిదారుల గరిష్ఠ లాభాల కోసం కార్మిక చట్టాలను రద్దు చేసిందని అన్నారు రోజువారి పని దినాన్ని ఎనిమిది గంటల నుండి 12 గంటలకు పెంచుకునేందుకు యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు సమ్మె హక్కులను కాలరాస్తూ ఆంక్షలు విధించిందని, కార్మిక సంఘాల గుర్తింపు రిజిస్ట్రేషన్ కష్టతరం చేసింది అన్నారు. ఉద్యోగ భద్రతను పాతర వేసి 300 మంది లోపు పని చేసే కంపెనీలో కార్మికులను ఎప్పుడైనా నోటీసు లేకుండా తొలగించేందుకు హైర్ అండ్ ఫైర్ విధానాన్ని తెచ్చారన్నారు. వేతనాల కోడ్ లో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానానికి స్వస్తి చెప్పారన్నారు. సామాజిక భద్రతా కోడ్, వృత్తి సంబంధిత రక్షణ, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ లతో భవన నిర్మాణం హమాలీలు ట్రాన్స్పోర్ట్ తదితర అసంఘటితనంగా కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని అన్నారు. పి ఎఫ్ ఈఎస్ఐ వెల్ఫేర్ బోర్డులపై వేటు వేశారని అన్నారు. కనుక లేబర్ కోడ్స్ అమలయితే వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మిక వర్గం మొత్తం తరతరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను కోల్పోతారని వెంటనే నాలుగు లేబర్ కోడ్ లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె అరుణ్ కుమార్ కార్మికులు మొలుగు కృష్ణ, నార్ల కంటి సాలయ్య, కందాల రవి, వెంకట్ రెడ్డి, గోపాల్, ఎకోస్వామి, మేతరి సంతోష్, పరమేష్, కమలాకర్, ఆమీర్ భాయ్, కృష్ణ, సురేష్, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్





**రాజేంద్రనగర్, విశాల భారతి :** ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం (07082026) పోలీసులు భారీ స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. చట్టంవ్యవస్థను కట్టుదిట్టం చేయడం, నేరాలను అరికట్టడం మరియు అనుమానితుల కదలికలను పర్యవేక్షించడం లక్ష్యంగా ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పాత పోలీస్ స్టేషన్ పరిధి, శివాజీ బస్తీ, ఎరుకల బస్తీ, అహ్మద్ నగర్, ఖాజీ గల్లి ప్రాంతాల్లో ఇంటింటికీ తనిఖీలు నిర్వహించారు. స్థానిక ప్రజల వివరాలను సేకరించి, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించారు. జోనల్, ట్రాఫిక్, హెడ్‌క్వార్టర్స్ సిబ్బంది కలిపి సుమారు 200 మంది పోలీసు సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. పోలీసు అధికారులు పర్యవేక్షణలో క్రమబద్ధంగా తనిఖీలు కొనసాగించారు. ఈ సందర్భంగా 8 మంది అనుమానితులను గుర్తించి, వారి వివరాలను పూర్తిగా పరిశీలించారు. అదేవిధంగా పాపిల్లాన్ బయోమెట్రిక్ పరికరం ద్వారా 100 మందికి పైగా వ్యక్తుల వివరాలను సేకరించి ధృవీకరించారు. ఈ ప్రక్రియ ద్వారా పాత కేసులు ఉన్నవారిని గుర్తించేందుకు ప్రయత్నించారు. మొత్తం 22 వాహనాలను స్వాధీనం చేసుకుని వాటిపై ధృవీకరణ ప్రక్రియ చేపట్టారు. అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సంబంధిత విభాగాలు చర్యలు ప్రారంభించాయి. అదనంగా 2 ఎక్సైజ్ కేసులను నమోదు చేయగా, డీజిల్ అక్రమ నిల్వకు సంబంధించిన మరో కేసును కూడా నమోదు చేశారు. ఈ ఆపరేషన్ ద్వారా ప్రాంతంలో భద్రతా వాతావరణం మరింత బలోపేతం కావడంతో పాటు, ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని పోలీసులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు తరచుగా నిర్వహిస్తామని తెలిపారు.

## ప్రతి ప్రిలిమినరీ పరీక్షలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేయాలి




**ముషీరాబాద్,విశాల భారతి:** ప్రతి ప్రిలిమినరీ పరీక్షలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేయాలని ఈ డబ్ల్యూ ఎస్ స్టూడెంట్ జేఏసీ ప్రసిడెంట్ నల్లమద్ది శివారెడ్డి డిమాండ్ చేశారు. పోలీస్ నియామకల్లో ఈడబ్ల్యూఎస్ కట్ ఆఫ్ ను 60 నుంచి 50 మార్కులకు తగ్గించాలని కోరారు. ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో శివారెడ్డి మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ ను దృష్టిలో పెట్టుకొని టెట్టు, సిటిఈటి పరీక్షల్లో అర్హత మార్కులను 90 నుంచి 75కు తగ్గించాలని కోరారు. జాతీయ స్థాయిలో ఈడబ్ల్యూఎస్ కమిషన్‌ను ఏర్పాటు చేసి ఇతర రిజర్వేషన్ వర్గాలకు అమలు చేస్తున్న విధంగానే ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, సంక్షేమ పథకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈడబ్ల్యూఎస్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ పావని, అఖిల్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, శివారెడ్డి, ఝాన్సీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డా. చిక్క దేవదాసు ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



**సికింద్రాబాద్, విశాల భారతి :** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ చేనేత అధ్యక్షులు డా. చిక్క దేవదాసు ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత రంగ అభివృద్ధి, చేనేత కళాకారుల సంక్షేమం, సంప్రదాయ నేత వస్త్రాల పరిరక్షణపై ప్రముఖులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి పూనం కౌర్, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవిలు, ప్రముఖ సామాజికవేత్త మందా జగన్, వై. వెంకన్న తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై చేనేత కార్మికులను అభినందించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు మంద జగన్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే చేనేత రంగాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచి నేతన్నలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు చేనేత ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెన్షన్ దారుల సంక్షేమానికి ప్రత్యేక డైరెక్టర్ ఏర్పాటు చేయాలి

**తెలంగాణ ప్రభుత్వ పెన్షన్ దారుల జేఏసీ చైర్మన్ లక్ష్మయ్య.**

**ముషీరాబాద్, విశాల భారతి:** ప్రభుత్వ పెన్షన్ దారుల సమస్యలను పరిష్కరించి వారి సంక్షేమానికి ప్రత్యేక డైరెక్టర్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం పెన్షన్ దారుల జేఏసీ చైర్మన్ లక్ష్మయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ పెన్షన్ దారుల దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యల సాధనకై తెలంగాణ ప్రభుత్వం పెన్షన్ దారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో మహాధర్నా చేపట్టారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి భారీగా తరలివచ్చిన పెన్షన్ దారులను ఉద్దేశించి చైర్మన్ లక్ష్మయ్య మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న పెన్షన్ దారులకు వెంటనే అన్ని ఆసుపత్రులలో నగదు రహిత చికిత్స కొరకు చర్యలు చేపట్టి పెన్షనర్లకు సత్వరమే వైద్యం అందినట్లు చూడాలని డిమాండ్ చేశారు. అలానే పెండింగ్లో ఉన్న డి ఎ, డి ఆర్ వాయిదాలను ప్రకటించి బకాయిలను నగదు రూపంలో చెల్లించాలని కోరారు.. అలానే రిటైర్డ్ అయిన ఉద్యోగులకు వెంటనే పూర్తి పెన్షన్ బెనిఫిట్స్ అందించాలని, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు సుధాకర్, పూర్ణచంద్రరావు, రాజేందర్ బాబు, సిద్ధారెడ్డి, తులసి, సత్యనారాయణ, భరత్ రెడ్డి, ఓం ప్రకాష్, పెద్ది రమేష్, నరసింహ రెడ్డి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయికి బాటసింగారం విద్యార్థులు..!

- జావెలిన్ త్రో, 400 మీటర్ల పరుగులో ప్రతిభ..
- జిల్లా స్థాయిలో మెరిసి రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్), బాటసింగారం విద్యార్థులు తెలంగాణ 12వ రాష్ట్రస్థాయి జావెలిన్ డే సెలబ్రేషన్ - పురుషులు, మహిళలు, సబ్ జూనియర్, జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026కు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచిందని ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రతాప్ తెలిపారు. ఈ నెల ఆగస్టు 8న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాన అథ్లెటిక్స్ స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ధనాంజనేయులు 16 ఏళ్లలోపు బాలుర జావెలిన్ త్రో విభాగంలో, తులసిరామ్ 18 ఏళ్లలోపు బాలుర 400 మీటర్ల పరుగు పోటీలో పాల్గొని తమ ప్రతిభను చాటనున్నారు. ఇటీవల ఆగస్టు 1న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఈ ఇద్దరు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడం విశేషం. విద్యార్థుల ఈ విజయంపై ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రతాప్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ గౌరీ శంకరాచారి, ఉపసర్పంచ్ వెంకటేష్, తల్లిదండ్రులు, గ్రామస్థులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించి పాఠశాలకు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి, రంగారెడ్డి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ఆపదలో ఉన్న వృద్ధుడికి అండగా నిలిచిన చిలకలగూడ పోలీసులు

**ఆశ్రమంలో చేర్పించిన ఇన్స్పెక్టర్ రామకృష్ణ**




**సికింద్రాబాద్, విశాల భారతి:** దిక్కులేని స్థితిలో రోడ్డుపై తిరుగుతున్న ఓ వృద్ధుడిని చిలకలగూడ పోలీసులు చేరదీశారు. సురక్షితంగా అతడిని ఓ ఆశ్రమంలో చేర్చి మానవత్వాన్ని చాటుకున్నారు. ఒంటరిగా తిరుగుతున్న వృద్ధుడిని గమనించిన పోలీసులు ఆయనతో మాట్లాడగా.. తన పేరు ఆవుల రమేష్ (65) అని తెలిపాడు. తనకు ఎవరూ లేరని, ఏదైనా ఆశ్రయం కల్పించాలని పోలీసులను వేడుకున్నాడు. దీనిపై వెంటనే స్పందించిన చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ తన సిబ్బందితో కలసి సికింద్రాబాద్ సంగీత్ సమీపంలోని డ్రీమ్ ఇండియా హోమ్‌ను సంప్రదించి, అందులో చేర్పించారు. తనను ఆశ్రమంలో చేర్పించిన పోలీసులకు వృద్ధుడు కృతజ్ఞతలు తెలిపాడు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంద్రయ్య, హెడ్ కానిస్టేబుల్ పూస శ్రీనివాస్ పాల్గొని వృద్ధుడి తరలింపును పర్యవేక్షించారు. ఆపదలో ఉన్న వృద్ధుడికి సహాయం చేసి ఆశ్రమంలో చేర్పించిన పోలీసుల చొరవను స్థానికులు కొనియాడారు.

# రాజేంద్రనగర్‌లో 20 రోజులుగా పైప్‌లైన్ లీకేజీ

**నీటి వృథాపై తీవ్ర ఆందోళన, హెచ్చరిక**



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ పరిధిలోని కిస్మత్పూర్ 122వ డివిజన్ ఎర్రకుంట తండాలో తాగునీటి పైప్‌లైన్ గత 20 రోజులుగా లీకై వేలాది లీటర్ల తాగునీరు వృథా అవుతోందని మాజీ సర్పంచ్ నీరుడు శేఖర్ ముదిరాజ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న ఈ ప్రాంతంలో ఇలాంటి లీకేజీ జరగడం ప్రజల్లో ఆగ్రహానికి దారి తీస్తోందన్నారు. ఈ సమస్యపై పలుమార్లు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి స్పందన రాకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. లీకేజీ కారణంగా రోడ్లపై నీరు నిల్వ ఉండటం వల్ల దుర్వాసన వ్యాపించడంతో పాటు, దోమల పెరుగుదలకు కూడా కారణమవుతోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అనేక రోజులుగా నీటి సరఫరా లో అంతరాయం కలుగుతోందని, ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పరిస్థితి మరింత విషమించే అవకాశం ఉందని హెచ్చరించారు. అధికారులు తక్షణమే స్పందించి పైప్‌లైన్ లీకేజీని మరమ్మతు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే స్థానిక ప్రజలతో కలిసి హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మాజీ సర్పంచ్ నీరుడు శేఖర్ ముదిరాజ్ స్పష్టం చేశారు.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి జైలుకు తరలింపు



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రంగారెడ్డి జిల్లాలో సంచలనానికి దారి తీసిన లైంగిక వేధింపుల కేసులో అరెస్టైన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని శుక్రవారం పోలీసులు ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా కేసుకు సంబంధించిన కీలక అంశాలను కోర్టు ముందు పోలీసులు వివరించినట్లు సమాచారం. కోర్టు ఆదేశాల మేరకు విచారణ అనంతరం ఉదయ్ కృష్ణారెడ్డిని రిమాండ్‌కు పంపుతూ జైలుకు తరలించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. అనంతరం పోలీసులు కట్టుదిట్టమైన భద్రత నడుమ ఆయనను జైలుకు తరలించారు. ఇప్పటికే ఈ కేసులో పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి, బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా పలు ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది. గతంలో కూడా నిందితుడిని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. తాజా కోర్టు ప్రక్రియతో కేసు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఘటనపై జిల్లా వ్యాప్తంగా చర్చ నడుస్తుండగా, న్యాయం జరిగేలా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని అధికార వర్గాలు పేర్కొన్నాయి. కేసు తదుపరి విచారణ కొనసాగుతోంది.

# శ్రీనిధి పాఠశాలలో కన్నులపండువగా బోనాల వేడుకలు

**భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యాల సమర్పణ**



**శేరిలింగంపల్లి విశాల భారతి:** శ్రీరామ్‌నగర్ బీ బ్లాక్‌లోని శ్రీనిధి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శుక్రవారం బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. వేడుకల సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని వేపాకుల తోరణాలు, పసుపు, ఎరుపు రంగులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. మహిళా పీఠంపై ప్రత్యేకంగా అలంకరించిన మహాకాళి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో వివిధ గ్రామదేవతల రూపాల్లో దర్శనమిస్తూ ఆకట్టుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుధ మాట్లాడుతూ.. బోనాలు తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ముఖ్యమైన పండుగ అని పేర్కొన్నారు. ఆషాఢ మాసంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని కాంక్షిస్తూ అమ్మవారికి బోనాన్ని నైవేద్యంగా సమర్పిస్తామని తెలిపారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, ఫలాలు సమర్పించి పూజలు నిర్వహించినట్లు వివరించారు. ప్రజలందరినీ అమ్మవారు చల్లగా చూడాలని కోరుకుంటూ బోనాల శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లడ్డూ రికార్డులతో పేరు.. పెట్టుబడుల పేరిట కోట్ల మోసం

**మైహోమ్ భుజా కొండపల్లి గణేష్ పై సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగంలో కేసు**

**సైబరాబాద్ - విశాల భారతి**







గణేష్ లడ్డూ వేలంలో రికార్డు ధర చెల్లించి వార్తల్లో నిలిచిన మాదాపూర్ మైహోమ్ భుజా అపార్టుమెంటు నివాసి కొండపల్లి గణేష్ పై కోట్ల రూపాయల మోసం కేసు నమోదైంది. రియల్ ఎస్టేట్, మద్యం వ్యాపారాల్లో పెట్టుబడులు పెడితే నెలకు ఆరు శాతం లాభాలు ఇస్తానని నమ్మించి అపార్టుమెంటు వాసుల నుంచి మూడు కోట్ల నలభై ఐదు లక్షల రూపాయలు వసూలు చేశాడని బాధితులు ఆరోపించారు.

**నెలకు ఆరు శాతం లాభం అంటూ..**

ఆర్థిక లావాదేవీల్లో మంచి పేరు ఉన్నట్లు చూపించుకున్న గణేష్.. రియల్ ఎస్టేట్, మద్యం వ్యాపారాల్లో పెడితే భారీ లాభాలు వస్తాయని మైహోమ్ భుజా అపార్టుమెంటులోని ఐదుగురిని నమ్మించారు. నెలకు ఆరు శాతం చొప్పున రాబడి ఇస్తానని హామీ ఇచ్చారు. ఆయన మాటలు నమ్మిన బాధితులు విడతల వారీగా కలిపి మూడు కోట్ల నలభై ఐదు లక్షల రూపాయలు పెట్టుబడిగా ఇచ్చారు. కొంతకాలం తర్వాత లాభాలు ఇవ్వకపోగా, అసలు డబ్బు కూడా తిరిగి ఇవ్వకుండా గణేష్ కాలయాపన చేయడంతో బాధితులు మోసపోయామని గ్రహించారు. వెంటనే సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు.

**సామాజిక గుర్తింపునే అడ్డం పెట్టుకున్నారా..**

ఖమ్మం జిల్లా ఇల్లందు ప్రాంతానికి చెందిన కొండపల్లి గణేష్ మైహోమ్ భుజా అపార్టుమెంటులో నివాసం ఉంటున్నారు. వరుసగా రెండు సంవత్సరాలు గణేష్ లడ్డూ వేలంలో పాల్గొని రికార్డు ధర చెల్లించారు. రెండు వేల ఇరవై నాలుగులో ఇరవై తొమ్మిది లక్షల రూపాయలకు, రెండు వేల ఇరవై ఐదులో యాభై ఒక్క లక్షల ఏడు వేల ఏడు వందల డెబ్బై ఏడు రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ వేలాలతో రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు గుర్తింపు వచ్చింది. ఈ సామాజిక గుర్తింపు, అపార్టుమెంటులో ఉన్న పరిచయాలనే ఆసరాగా చేసుకుని బాధితులను నమ్మించి మోసం చేసినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు.

**లోతైన దర్యాప్తు..**

బాధితుల ఫిర్యాదు మేరకు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గణేష్ బ్యాంకు లావాదేవీలు, ఆస్తుల వివరాలను సేకరిస్తున్నారు. ఇంకా ఎంతమంది బాధితులు ఉన్నారనే కోణంలోనూ విచారిస్తున్నారు.

# ఖాకీ కలలకు అండగా..!




- పోలీస్ ఉద్యోగార్థులకు ఎంఆర్ఆర్ ఫౌండేషన్, మల్ రెడ్డి యువశక్తి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ..
- 9 నుంచి దరఖాస్తుల స్వీకరణ – అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి పిలుపు

**విశాల భారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :**

పోలీస్ ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న యువతకు అండగా నిలిచేందుకు ఎంఆర్ఆర్ ఫౌండేషన్, మల్ రెడ్డి యువశక్తి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణా కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 9వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుండగా, కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను మల్ రెడ్డి యువశక్తి సారథి మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి పరిశీలించారు. ఇబ్రహీంపట్నం-మంచాల రోడ్డులోని బైపాస్ ప్రవేశద్వారం వద్ద ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై నాయకులకు పలు సూచనలు చేశారు. దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లు, తాగునీటి సౌకర్యం, పార్కింగ్, స్వచ్ఛంద కార్యకర్తల నియామకం, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ.. ఆగస్టు 9 నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని, అవసరమైతే గడువును పొడిగించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. అలాగే ఆగస్టు 10 నుంచి ఇబ్రహీంపట్నం ప్రజాభవన్‌లో కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న ప్రతి అభ్యర్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ తీవ్రంగా పెరుగుతున్న నేపథ్యంలో నోటిఫికేషన్ కోసం ఎదురుచూడకుండా ఇప్పటి నుంచే క్రమబద్ధంగా సన్నద్ధం కావాలని సూచించారు. యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనే ఉద్దేశంతో ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఉద్యోగ సాధనలో ప్రతి అభ్యర్థికి తమ వంతు సహకారం అందిస్తామని మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి తెలిపారు.

# అధిక బస్సు సర్వీసులు కావాలి..!

**విశాల భారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :**



పసుమాముల గ్రామ ప్రజల ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో అధిక ఎలక్ట్రిక్ ఏసీ బస్సు సర్వీసులు నడపాలని గ్రామ ప్రజల తరఫున తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) హయత్‌నగర్ డిపో-2 మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో గ్రామ ప్రజలు పేర్కొన్న వివరాల ప్రకారం.. పసుమాముల గ్రామం నుంచి ప్రతిరోజూ విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, వృద్ధులు హయత్‌నగర్, ఎల్బీనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతం నడుస్తున్న బస్సు సర్వీసులు సరిపోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం విద్యాసంస్థలు, ఉద్యోగాలకు వెళ్లే సమయంలో, సాయంత్రం తిరిగి గ్రామానికి వచ్చే వేళల్లో బస్సుల కొరత కారణంగా గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు ఎలక్ట్రిక్ ఏసీ బస్సు సర్వీసులు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రస్తుతం నడుస్తున్న సర్వీసుల సంఖ్యను కూడా పెంచాలని గ్రామ ప్రజలు కోరారు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు సమయానికి తమ గమ్యస్థానాలకు చేరుకోవడంతో పాటు ప్రజలకు సౌకర్యవంతమైన, సురక్షితమైన ప్రజారవాణా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పసుమాముల గ్రామ ప్రజల వినతిని సానుకూలంగా పరిశీలించి వీలైనంత త్వరగా అధిక బస్సు సర్వీసులు మంజూరు చేసి గ్రామ ప్రజల రవాణా సమస్యను పరిష్కరించాలని హయత్‌నగర్ డిపో-2 మేనేజర్‌ను వారు కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సోమయ్య జనరల్ సెక్రెటరీ యాకూబ్ పాషా తో పాటు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జైలు భరోకు సన్నద్ధం కావాలి



- సీఐటీయూ కార్యదర్శి కృష్ణ
- చందానగర్‌లో కరపత్రాల ఆవిష్కరణ
- ఆగస్టు 10 ఆందోళనకు పిలుపు

**చందానగర్-విశాల భారతి**

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శేరిలింగంపల్లి జోన్ సీఐటీయూ ఆధ్వర్యంలో చందానగర్ పీజేఆర్ స్టేడియంలోని గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ శేరిలింగంపల్లి జోన్ కార్యదర్శి కొంగరి కృష్ణ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 10న అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట జైలు భరో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కరపత్రాలను విడుదల చేసినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేస్తోందని, రైతాంగ ప్రయోజనాలకు విరుద్ధంగా విదేశీ ఒప్పందాలు కుదుర్చుకుంటోందని ఆరోపించారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు దేశంలోకి రావడం వల్ల స్థానిక రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి అవకాశాలు తగ్గుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటది

- ఎల్బీనగర్ పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ పున్న గణేష్ నేత



**ఎల్బీనగర్ విశాల భారతి :** పద్మశాలి సంఘం ఎల్బీనగర్ సర్కిల్ ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత జెండాను ఆవిష్కరించిన సంఘం అధ్యక్షులు ,ఎల్బీనగర్ పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ పున్న గణేష్ నేత,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత వృత్తిపై ఆధారపడిన వారందరికీ తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేనేత కార్మికుల రుణమాఫీ చేసినందుకు, ప్రతి ఒక్క అర్హులైన చేనేత కార్మికులకు 50 సంవత్సరాల నుండి జీవించేవరకు చేనేత బీమా పథకాన్ని వర్తింప చేయడానికి, కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది,వారసత్వ సంపదను కాపాడుతున్న చేనేత కళాకారులు అందరికీ జాతీయ చేనేత శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఒక్కరు వారానికి రెండు రోజులు చేనేత వస్త్రాలు వాడాలని చేనేత పరిశ్రమను కాపాడాలని చేనేతను ప్రోత్సహించాలని ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సంఘము ఉపాధ్యక్షులు కౌకుంట రవితేజ, గుర్రం శ్రవణ్ నేత, తలాటి రమేష్ నేత,జెల్ల జగన్నాథం నేత,ప్రధాన కార్యదర్శి గడ్డం లక్ష్మీనారాయణమహిళా అధ్యక్షురాలు రమాదేవి, చెరుపల్లి ప్రభాకర్, దోర్నాల చంద్రమౌళి, మ్యాకం గోపాల్ ,కైరం కొండ ఉదయ్, తాటి శ్రీధర్తదితరులు పాల్గొన్నారు

# దళితుల భూముల జోలికి వస్తే ఉద్యమమే..!

- హన్మగల్–హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీ సర్వే నెం.255/1 భూముల వ్యవహారంలో బాధితులకు మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మద్దతు




**విశాల భారతి , అబ్దుల్లాపూర్‌మెట్ :** రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండల పరిధిలోని హన్మగల్-హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీలోని సర్వే నెం.255/1 భూముల వ్యవహారంలో దళితులు, పేద ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన కార్యక్రమంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని బాధితులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న దళితులు, పేదల భూములను కబ్జా చేయడం లేదా వారి హక్కులను హరించే ప్రయత్నాలను భారతీయ జనతా పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. దళితులు, బలహీన వర్గాల భూములపై ఎలాంటి అన్యాయం జరిగినా ప్రజలతో కలిసి ఉద్యమించి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రజల హక్కుల పరిరక్షణే తమ ధ్యేయమని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలుస్తూ వారి న్యాయపోరాటానికి పూర్తి మద్దతు అందిస్తామని కళ్లెం నవజీవన్ రెడ్డి పేర్కొన్నారు. దళితుల హక్కులను కాలరాసే ఏ చర్యనైనా ప్రజాస్వామ్యబద్ధంగా తిప్పికొడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, నాయకులు నక్క రవీందర్, దళిత నాయకులు బోడ శ్రీరాములు, గంగాని నగేష్, శంకరయ్య, కాటేపాక మల్లేష్, ఈశ్వర్, స్కైలాబ్ తదితరులు పాల్గొని బాధితులకు మద్దతు ప్రకటించారు.

# మూసీలో మిస్టరీ... యువకుడి మృతదేహం కలకలం

- గౌరెల్లి మూసీ వంతెన సమీపంలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం..
- వివరాలు తెలిసిన వారు వెంటనే సమాచారం ఇవ్వాలని నాగోల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ విజ్ఞప్తి

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ ::** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం గౌరెల్లి మూసీ వంతెన సమీపంలోని మూసీ నదిలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను నాగోల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నాగోల్ పెట్రోల్ కార్-1కు డయల్-112 ద్వారా గౌరెల్లి మూసీ వంతెన సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించిందని సమాచారం అందింది. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పరిశీలించారు. పోలీసుల విచారణలో మృతుడు సుమారు 18 నుంచి 20 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడిగా గుర్తించారు. అతను బూడిద రంగు చొక్కా, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉండగా, నడుముకు ఎరుపు రంగు దారం కట్టుకుని ఉన్నట్లు గుర్తించారు. మృతదేహంపై ఎలాంటి బాహ్య గాయాలు, గుర్తింపు తెలిపే పచ్చబొట్లు కనిపించలేదని ఇన్స్పెక్టర్ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించి భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడి గుర్తింపు ఇంకా తెలియరాలేదని, అతని వివరాలు తెలిసిన వారు లేదా కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే వెంటనే నాగోల్ పోలీస్ స్టేషన్‌ను లేదా క్రింది నంబర్లను సంప్రదించాలని ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. **సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 8712662751, 8712662723, 8712662752 కు తెలియజేయాలని కోరారు.**

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

**తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ ను కలిసి విజ్ఞప్తి చేసిన విద్యార్థి జన సమితి**



**ముషీరాబాద్,విశాల భారతి:** తెలంగాణ రాష్ట్రం లోని విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని విద్యార్థి జన సమితి తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం సమితి రాష్ట్ర నాయకులు చెరుకు శివరాజ్, మాలోతు రవికుమార్, మంద మిట్టు, నీలేష్, మణిందర్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో రాష్ట్రంలోని వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కళాశాలలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తుండటంతో వారి విద్యాభ్యాసం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అత్యవసరంగా పెండింగ్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులు చదువుకునేందుకు వీలు కల్పించాలని కోరారు.,

## జగద్గిరిగుట్టలో కేదారీనాథ్ ఆలయ నిర్మాణానికి విరాళం



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ జగద్గిరిగుట్టలో త్వరలో ప్రారంభం కానున్న శ్రీ కేదారీనాథ్ ఆలయ నిర్మాణానికి డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు అన్నపురెడ్డి మాధవ్ రెడ్డి తనవంతు సహాయంగా రూ.1 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన చెక్కును కేదారీనాథ్ క్షేత్రాధిపతి శివరుద్ర సాధుకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మాధవ్ రెడ్డి, ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఆలయ నిర్మాణం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం శ్రీ కేదారీనాథ్ ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికలను కిస్మత్‌పూర్ దేవాలయ కమిటీ సభ్యులకు శివరుద్ర సాధు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నీరుడు శేఖర్ ముదిరాజ్, దళితరత్న అవార్డు గ్రహీత అంతయ్య, వెంకిర్యాల సంతోష్ గౌడ్‌తో పాటు పలువురు గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## ధర్మనగూడ ఉప సర్పంచ్‌పై ముగ్గురు వ్యక్తులు దాడి



**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** యాచారం మండల పరిధిలోని ధర్మనగూడ గ్రామంలో తీవ్ర కలకలం రేగింది. గ్రామాభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న ఉప సర్పంచ్ నాగరాజుపై ముగ్గురు వ్యక్తులు అకస్మాత్తుగా వచ్చి దాడికి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనుల వద్ద ఉప సర్పంచ్ నాగరాజు దగ్గరుండి పనులను చూస్తున్నారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న బండ చెన్నయ్య, శ్రీశైలం, శ్రీనివాస్ అనే ముగ్గురు వ్యక్తులు రోడ్డు పనులను అడ్డుకుంటూ ఉప సర్పంచ్‌తో తీవ్ర వాగ్వాదానికి దిగారు. అనంతరం నాగరాజును అసభ్య పదజాలంతో బూతులు తిడుతూ, ప్రజా ప్రతినిధి అనే కనీస గౌరవం కూడా లేకుండా ఆయనపై భౌతిక దాడికి పాల్పడ్డారు. ఈ అకస్మాత్ పరిణామంతో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం బాధితుడు ఉప సర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ కొందరు కావాలనే గ్రామ అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఇటువంటి పనులకు ఆటంకం కలిగించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. తనపై దాడికి పాల్పడిన బండ చెన్నయ్య, శ్రీశైలం, శ్రీనివాస్‌లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ యాచారం పోలీస్ స్టేషన్‌లో నాగరాజు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## హైదర్‌నగర్‌లో అభివృద్ధి పనుల జాతర

**ప్రైవేట్ నిర్మాణాల ఆక్రమణలపై ఆరెకపూడి గాంధీ ఆగ్రహం**



**శేరిలింగంపల్లి విశాల భారతి:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్, రామ్‌నరేష్ నగర్, గౌతమినగర్, హెచ్ఎంటీ శాతవాహన నగర్‌లలో రూ. 1.17 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ (యుజిడి) పనులకు మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. నాణ్యతతో, వేగవంతంగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు.ఇదే క్రమంలో గౌతమినగర్, నాగార్జున హోమ్స్ పరిసరాల్లో ప్రైవేట్ డెవలపర్లు నిబంధనలు ఉల్లంఘించి చేపడుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాలపై ఆయన మండిపడ్డారు. 60 ఫీట్ల రోడ్డును 100 ఫీట్లుగా చూపి అనుమతులు పొందడం, నాలా ఆక్రమణలు, బఫర్ జోన్ నిర్మాణాల వల్ల స్థానికులకు తీవ్ర ముప్పు వాటిల్లుతోందని, ఆ అక్రమ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాలనీ వాసుల హక్కుల కోసం తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## బోనాల వేళ మందుబాబులకు నిరాశ

**సైబరాబాద్ పరిధిలో వైన్ షాపులు, బార్లు బంద్**




**సైబరాబాద్ విశాల భారతి:** బోనాల పండుగను పురస్కరించుకుని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాలను తాత్కాలికంగా మూసివేయాలని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేశ్ ఆదేశాలు జారీ చేశారు. పండుగ వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలను పరిరక్షించేందుకు తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ చట్టం1968లోని సెక్షన్ 20 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ ఉత్తర్వుల ప్రకారం ఆగస్టు తొమ్మిదో తేదీన ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కూకట్‌పల్లి, అల్లాపూర్, రాయదుర్గం, జీడిమెట్ల, మేడ్చల్, చందానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని వైన్ షాపులు, కల్లు కాంపౌండ్లు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లు మూతపడనున్నాయి. అయితే ఫైవ్ స్టార్ హోటళ్లలోని బార్లకు, రిజిస్టర్డ్ క్లబ్బులకు ఈ నిషేధం నుంచి మినహాయింపునిస్తున్నట్లు సీపీ స్పష్టం చేశారు. భక్తులు బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకొనేందుకే ఈ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

## వట్టినాగులపల్లి వద్ద గుర్తుతెలియని యువకుడి మృతదేహం

**కేసు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు**

**సైబరాబాద్ విశాల భారతి:** ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు పక్కన ఉన్న కల్వర్ట్‌లో ఓ యువకుడి మృతదేహం లభ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం... బుధవారం సాయంత్రం వట్టినాగులపల్లి ప్రాంతంలో పెట్రోల్ మొబైల్ ఇన్‌ఛార్జ్ రమేశ్, డ్రైవర్ శ్రీకాంత్ విధులు నిర్వర్తిస్తుండగా డయల్ 100 ద్వారా సమాచారం వచ్చింది. కోకాపేట్ సమీపంలోని కల్వర్ట్‌లో మృతదేహం పడి ఉందన్న సమాచారంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు.మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని, ఎరుపు రంగు టీషర్టు, గోధుమ రంగు షార్ట్స్ ధరించి ఉన్నాడని వెల్లడించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు గుర్తింపు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీస్ ఉద్యోగాలకు ఉచిత కోచింగ్



**పాల్వంచ విశాలభారతి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచలో పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న డిగ్రీ విద్యార్థుల కోసం టి.జె.ఎల్.ఎస్.ఎస్. (శ్రీ తోకల జగన్నాథం-లక్ష్మమ్మ సేవా సమితి), పాల్వంచ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ ప్రారంభించారు. ముఖ్య అతిథి టి.జి.ఎస్.పి.ఎఫ్., కె.టి.పి.ఎస్. యూనిట్ డి.ఎస్.పీ. ఎస్. చంద్రశేఖర్ మాట్లాడుతూ, క్రమశిక్షణతో శారీరక సాధనతో పాటు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, అర్థమెటిక్, మెంటల్ ఎబిలిటీ వంటి అంశాల్లో పట్టు సాధిస్తే పోలీస్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం సులభమవుతుందని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులకు ఉచిత కోచింగ్ మెటీరియల్, పోలీస్ నియామక పరీక్షల మోడల్ ప్రశ్నాపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తోకల రామదాసు, డాక్టర్ టి. అరుణ కుమారి, కోటగిరి రాంబాబు, ఫిజికల్ డైరెక్టర్ పొట్లపువ్వు శ్రీనివాసరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ తులసి విజయ్ ప్రసాద్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణకు ఏర్పాట్లు

- **ఈ నెల 9న ప్రారంభం కానున్న దరఖాస్తుల స్వీకరణ**
- **బైపాస్ రోడ్డులో ఏర్పాట్లు పరిశీలించిన మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి**
- **అభ్యర్థులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి**

**విశాల భారతి ఇబ్రహీంపట్నం**



ఎం ఆర్ ఆర్ ఫౌండేషన్, మల్ రెడ్డి యువశక్తి నేతృత్వంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పోలీస్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ నెల 9న ఆదివారం దరఖాస్తుల స్వీకరణ మొదలుకానుంది. ఇబ్రహీంపట్నం మంచాల రోడ్డులో బైపాస్ వద్ద ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మల్ రెడ్డి యువశక్తి సారథి అభిషేక్ రెడ్డి పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యుఐ నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. మంచాల రోడ్డులో భారత్ గార్డెన్ నుంచి సాగర్ రోడ్డు వరకు ఇటీవల నిర్మించిన బైపాస్ ఎంట్రెన్స్ వద్ద దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని, అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పనపై నాయకులతో చర్చించారు. దరఖాస్తుల స్వీకరణ సజావుగా జరిగేలా కౌంటర్ల ఏర్పాటు, అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్వచ్ఛంద కార్యకర్తల నియామకం, పార్కింగ్, తదితర అంశాలపై అభిషేక్ రెడ్డి సమీక్ష నిర్వహించి, నాయకులకు పలు సూచనలు చేశారు. కొనసాగనున్న దరఖాస్తుల స్వీకరణ పోలీస్ ఉద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు ఈ నెల 9న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై 15వ తేదీ వరకు కొనసాగుతుందని అభిషేక్ తెలిపారు. అనంతరం, పరిస్థితులను బట్టి పొడిగింపు నిర్ణయం ఉంటుందని చెప్పారు. ఇబ్రహీంపట్నంలోని ప్రజాభవన్ లో 10వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు.

**విజయానికి ముందడుగేయండి**

పోలీస్ కావాలనే వారి లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని, తమ వంతు సహకారంగా ఈ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలకు పెరుగుతున్న పోటీ, సిలబస్ ని దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులు ప్రిపరేషన్ ప్రారంభించాలని ఆయన సూచించారు. రాజకీయ నిరుద్యోగుల ట్రాప్ లో పడకుండా తల్లిదండ్రుల కలలు సాకారం చేసే దిశగా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఇందుకు తాము అండగా ఉంటామని చెప్పారు. నోటిఫికేషన్, పోస్టుల విషయంలో ఆందోళన చెందకుండా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమీక్ష



**శేరిలింగంపల్లి - విశాల భారతి**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అవగాహన కార్యక్రమంపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, హమీద్ పటేల్, నార్నె శ్రీనివాస రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వచ్చి ఇచ్చే ఎన్యుమరేషన్ పత్రంలో పూర్తి వివరాలు నింపి, సంతకం చేసి తిరిగి వారికే అందజేయాలని స్పష్టం చేశారు. ఫారం తిరిగి ఇచ్చిన వారికి మాత్రమే ఓటు హక్కు లభిస్తుందని, నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో కళ్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి, వివిధ సబ్సిడీలు వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఫారం అందజేసిన వెంటనే అధికారుల నుంచి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని కోరారు.గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, ఎత్తైన భవన సముదాయాలలోకి అధికారులకు ప్రవేశం కల్పించి సిబ్బందికి స్థానిక కాలనీ సంక్షేమ సంఘాలు, యువత పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లు లేకుండా ఓటరు జాబితా సవరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లను నమ్మవద్దని, అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆక్రమణలపై 'వాక్ ఫ్రీ' కొరడా

- **14.1 కి.మీ.లో 290 ఆక్రమణలు తొలగింపు**
- **మూడు జోన్లలో సీఎంసీ ప్రత్యేక డ్రైవ్**
- **ఫుట్‌పాత్‌లు, రహదారులు ప్రజలకు అందుబాటులోకి**

**సైబరాబాద్-విశాల భారతి**



రహదారులు, ఫుట్‌పాత్‌లు, ప్రజా స్థలాలను ఆక్రమణల నుంచి విముక్తం చేసి పాదచారులు, వాహనదారులకు సురక్షితమైన రాకపోకలు కల్పించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) చేపట్టిన 'వాక్ ఫ్రీ' ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. తాజా డ్రైవ్‌లో మూడు జోన్ల పరిధిలో 14.1 కిలోమీటర్ల మేర తనిఖీలు నిర్వహించిన అధికారులు మొత్తం 290 ఆక్రమణలను తొలగించారు. ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లు, వ్యాపార స్టాళ్లు, రాకపోకలకు ఆటంకంగా ఉన్న ఇతర ఆక్రమణలను తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. జోన్ల వారీగా పరిశీలిస్తే శేరిలింగంపల్లి జోన్‌లో 4.7 కిలోమీటర్ల మేర డ్రైవ్ నిర్వహించి 85 ఆక్రమణలను తొలగించారు. ఇందులో నార్సింగి సర్కిల్‌లో 33, అమీన్‌పూర్‌లో 17, మియాపూర్‌లో 25, శేరిలింగంపల్లిలో 10 ఆక్రమణలు తొలగించారు. కూకట్‌పల్లి జోన్‌లో 3.1 కిలోమీటర్ల మేర తనిఖీలు చేపట్టి 55 ఆక్రమణలను తొలగించారు. మాదాపూర్‌లో 14, ఆల్విన్ కాలనీలో 14, కూకట్‌పల్లిలో 15, మూసాపేట్‌లో 12 ఆక్రమణలపై చర్యలు తీసుకున్నారు. కుత్బుల్లాపూర్ జోన్‌లో అత్యధికంగా 6.3 కిలోమీటర్ల పరిధిలో డ్రైవ్ నిర్వహించి 150 ఆక్రమణలను తొలగించారు. కొంపల్లిలో 35, నిజాంపేట్‌లో 26, జీడిమెట్లలో 24, గాజులరామారంలో 20, దుండిగల్‌లో 16, మేడ్చల్‌లో 15, చింతల్‌లో 14 ఆక్రమణలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో మళ్లీ అక్రమ నిర్మాణాలు లేదా వ్యాపార కార్యకలాపాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎంసీ అధికారులు హెచ్చరించారు. ప్రత్యేక బృందాలతో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ రహదారులు, ఫుట్‌పాత్‌లు ప్రజలకే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాదచారుల భద్రతే 'వాక్ ఫ్రీ' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, సైబరాబాద్‌లోని అన్ని జోన్లలో ఈ ప్రత్యేక డ్రైవ్ నిరంతరం కొనసాగుతుందని మున్సిపల్ కమిషనర్ జి. శ్రీజన పేర్కొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల పట్ల వైఖరిని మార్చుకోవాలి

**రిటైర్డ్ జిహెచ్ఎం ఎంఈఓ పోచం బావి మహేందర్**



విశాల భారతి ఇబ్రహీంపట్నం: తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల ద్వంద వైఖరిని అవలంబిస్తూ పెన్షనర్స్ సమస్యలను గత రెండు సంవత్సరాలుగా పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని అన్నారు. జాక్టో పిలుపు మేరకు పెన్షనర్లు ఇందిరా పార్క్ వద్ద తప్పనిసరి పరిస్థితుల్లో వారి వృద్ధాప్యాన్ని లెక్కచేయకుండా ధర్నాకు పూనుకోవడం దురదృష్టకరం బాధాకరమని అన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల పట్ల సానుకూల వైఖరిని ప్రదర్శించి గతంలో ఇచ్చిన హామీలను పి ఆర్ సి ని, 6డి ఏ లను, ఈ హెచ్ ఎస్ స్కీం వంటి అంశాలపై పెండింగ్ పెట్టకుండా వెంటనే సమస్యలను, జీవోలను వెల్లడించి అమలు చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ తరపున కోరారు. లేనిచో ప్రభుత్వం భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని గుర్తు చేశారు. తెలంగాణ ధనిక రాష్ట్రం, సమృద్ధిగా సహజ వనరులు సంపదలు గల రాష్ట్రం. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్లు వారి అవసరాల కోసం ప్రభుత్వాన్ని సంప్రదిస్తామని తెలిపారు. సరైన ప్రణాళికలతో పథకాలతో నిర్ణయాలు తీసుకొని అధికారులు ప్రజలకు ఉద్యోగులకు మేలు చేకూరే విధంగా చూడాలని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చుకుని మాట నిలబెట్టుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు.

## నాల్సా జాగృతి అవగాహన కార్యక్రమం



**పాల్వంచ విశాలభారతి:** నాల్సా జాగృతి స్కీమ్-2025 కార్యక్రమంలో భాగంగా పాల్వంచ ప్రభుత్వ మైనారిటీ పాఠశాలలో విద్యార్థులకు న్యాయ, సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోక్సో చట్టం , బాలల హక్కుల చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం తదితర అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. చిన్నారుల రక్షణలో భాగంగా గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి కూడా విద్యార్థులకు వివరించి, తమకు అసౌకర్యంగా అనిపించే పరిస్థితులను గుర్తించి, వెంటనే విశ్వసనీయమైన పెద్దలకు తెలియజేయాలని సూచించారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యానికి, వ్యక్తిత్వ వికాసానికి క్రీడల వల్ల కలిగే శారీరక, మానసిక ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా వినియోగదారుల హక్కులు వినియోగదారులుగా తమ హక్కులను తెలుసుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీమతి బద్ది అనురాధ, శ్రీ ఇమాన్ నిర్వహించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని, ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని వారు సూచించారు. విద్యార్థుల్లో న్యాయపరమైన అవగాహన పెంపొందించడంతో పాటు, బాలల రక్షణ, హక్కుల పరిరక్షణపై చైతన్యం కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## సీబీఐటీలో ఘనంగా వృక్షారోపణ కార్యక్రమం

**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: ప్రిన్సిపాల్ నరసింహులు**



**హైదరాబాద్, విశాలభారతి:** గండిపేటలోని చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)లో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా గురువారం వృక్షారోపణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించే ఈ కార్యక్రమానికి సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. వి. నరసింహులు ముఖ్య అతిథిగా హాజరై మొక్కను నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ నరసింహులు మాట్లాడుతూ.. వృక్షాలు స్వచ్ఛమైన గాలిని అందించడమే కాకుండా జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో, వాతావరణ సమతుల్యతను కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని, ప్రకృతి పరిరక్షణను తమ జీవన విధానంగా అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు మొదటి సంవత్సరం బి.ఈ./బి.టెక్. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కళాశాల ఆవరణలో పలు మొక్కలను నాటారు. అనంతరం మొక్కల సంరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. సీబీఐటీ ప్రాంగణాన్ని మరింత పచ్చదనంతో నింపే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించిందని నిర్వాహకులు తెలిపారు.

## యూపీహెచ్‌సీ జగద్గిరిగుట్టలో టీబీ నిర్మూలనకు అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమం

**కార్యక్రమాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో డా. ఆనంద్, డా. జ్యోతి – ప్రారంభ దశలోనే టీబీ గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన**


**కూకట్ పల్లి విశాల భారతి:**



దేశాన్ని క్షయవ్యాధి (టీబీ) రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో యూపీహెచ్‌సీ జగద్గిరిగుట్టలో శుక్రవారం టీబీ స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో డా. ఆనంద్ మరియు కూకట్‌పల్లి డివిజన్ డీఎంహెచ్‌వో డా. జ్యోతి సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. స్క్రీనింగ్ ప్రక్రియ, ప్రజలకు అందిస్తున్న అవగాహన కార్యక్రమాలను పరిశీలించిన అధికారులు సిబ్బంది పనితీరును అభినందించారు. టీబీ అనుమానితులను ప్రారంభ దశలోనే గుర్తించి, ప్రతి ఒక్కరికీ సమర్థవంతంగా స్క్రీనింగ్ నిర్వహించాలని, నిర్ధారణ అయిన రోగులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పూర్తిస్థాయి చికిత్స అందిస్తూ నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. ప్రేమామృత, ఎన్‌టీఈపీ (NTEP) సిబ్బంది, ఐదుగురు ఎన్‌సీసీ క్యాడెట్లు, యూపీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొని ప్రజలకు టీబీ లక్షణాలు, వ్యాధి నివారణ, ఉచిత పరీక్షలు, చికిత్స సౌకర్యాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అధికారుల సందర్శన, మార్గదర్శకాలు, సిబ్బందికి అందించిన ప్రోత్సాహం కార్యక్రమ విజయానికి మరింత ఊతమిచ్చిందని నిర్వాహకులు తెలిపారు.

# కోటీశ్వరులకు రైతుబంధు ఎందుకు?

- లగ్జరీ బైక్‌లు వాడేవారికి రీయింబర్స్‌మెంట్ ఎందుకు?
- ఉచిత పథకాలతో త్వరలో ప్రమాదకర పరిస్థితులు
- రాష్ట్ర జనాభాకు మించి తెల్ల రేషన్ కార్డుదారులు
- ఉచితాలతో జనం పనికి వెళ్లడం మానేశారు
- వ్యవసాయ కూలీలు దొరక్క రైతులు ఏడుస్తున్నారు
- ఖజానాలో డబ్బు లేకపోతే అధికారి ఏం చేస్తారు?
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు చురకలు
- ధిక్కరణ కేసులో సందీప్ సుల్తానియా కోర్టుకు హాజరు



**విశాల భారతి, హైదరాబాద్:**

ఉచిత పథకాలతో త్వరలో రాష్ట్రంలో చాలా ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. కోటీశ్వరులకు రైతుబంధు, లగ్జరీ బైక్‌లపై తిరిగే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకని జస్టిస్ నగేశ్ భీమపాక వ్యాఖ్యానించారు. స్టాంప్ డ్యూటీపై కంటోన్మెంట్ బోర్డు నుంచి వసూలు చేసిన సర్‌ఛార్జిని తిరిగి చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కంటోన్మెంట్ బోర్డు మెంబర్‌గా వ్యవహరించిన జె.రామకృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇటీవల విచారణ చేపట్టిన హైకోర్టు సర్‌ఛార్జి తిరిగి చెల్లించాలని ప్రభుత్వాన్నిఆదేశించింది. కోర్టు ఆదేశాలు అమలు కాకపోవడంతో పిటిషనర్ జె.రామకృష్ణ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రతివాదిగా ఉన్న ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు పలుమార్లు నోటీసు ఇచ్చినప్పటికీ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో పాటు ప్రత్యక్ష హాజరు నుంచి మినహాయింపు కోరకుండానే గైర్హాజరు కావడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయనపై కొద్ది రోజుల క్రితం బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. వారంట్ అమలు చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. రూ.5 వేల విలువకు వ్యక్తిగత బాండ్ ఇస్తేనే బెయిల్ ఇవ్వాలని పేర్కొంది. కోర్టు హాజరవుతానన్న హామీతో పూచీకత్తు తీసుకుని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు బెయిల్ మంజూరు చేశారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సుల్తానియా జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా సుల్తానియా వివరణ ఇస్తూ.. పిటిషనర్‌కు చెల్లించాల్సిన మొత్తంలో రూ.25.45 కోట్లు ఇచ్చేశామన్నారు. మిగతా మొత్తాన్ని వాయిదాల రూపంలో చెల్లిస్తామని చెప్పారు. ఈ చెల్లింపు వివరాలతో అఫిడవిట్ దాఖలు చేస్తామని కోర్టుకు నివేదించారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తూ ప్రభుత్వం చెల్లింపులు చేసిన నేపథ్యంలో సంతృప్తి చెందిన ధర్మాసనం.. సందీప్ కుమార్ సుల్తానియాకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ వద్ద నిధులు లేకపోవడానికి ఉచిత పథకాలే కారణమని జస్టిస్ నగేశ్ భీమపాక అభిప్రాయపడ్డారు. తాను ప్రభుత్వానికి లేదా మరెవ్వరికీ వ్యతిరేకంగా మాట్లాడటం లేదని చెప్పారు. ''కూలీలు దొరకక గ్రామాల్లో రైతులు ఏడుస్తున్నారు. ఎవ్వరూ పనికి వెళ్లడం లేదు. ప్రజలు ఒకప్పుడు పనులు చేసుకునే వారట అని మనం వీడియోల్లో చూసుకోవాల్సి వస్తుంది. ఖజానాలో నిధులు లేనప్పుడు ఎవరు మాత్రం ఏంచేస్తారు? ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి స్థానంలో ఎవరున్నా ఏమీ చేయలేరు. ఆయనపై వెయ్యి కోర్టు ధిక్కరణ కేసులు ఉన్నాయి. ఈ లెక్కన ఆయన జీవితాంతం జైల్లో ఉండాల్సి వస్తుంది. ప్రత్యక్ష హాజరుకు ఆదేశించడం బాధాకరమే.. కానీ, కోర్టు ఉత్తర్వుల అమలుకు తప్పదు'' అని జడ్జి వ్యాఖ్యానించారు. ''రాష్ట్రంలో 1.05 కోట్ల తెల్లరేషన్ కార్డులు ఉండటం ఏంటి? రాష్ట్ర జనాభా కన్నా ఎక్కువ మంది తెల్లరేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యులుగా ఉన్నారు'' అన్నారు. మా ఊరికి ఏం పనులు చేస్తారు అని అడిగే పరిస్థితి నుంచి నాకు ఏం పథకాలు వస్తున్నాయి ? అని అడిగే పరిస్థితికి వచ్చేశామని వ్యాఖ్యానించారు. తదుపరి విచారణ ఈ నెల 19కి వాయిదా వేశారు.

పోలీస్ స్టేషన్లలో స్వీపర్లకు కనీస వేతనాలు

పోలీస్ స్టేషన్‌లలో పనిచేసే స్వీపర్లు, అటెండర్లకు కనీస వేతనాలు చెల్లించాలని జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. కనీస వేతనాలు అమలు చేయకుండా ఏకమొత్తంలో తక్కువ జీతాలు ఇస్తున్నారని పేర్కొంటూ వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేసే 49 మంది స్వీపర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కనీస వేతనాలపై ప్రభుత్వం జారీ చేసిన తాజా నోటిఫికేషన్ల ప్రకారం పిటిషనర్లకు కనీస వేతనాలు చెల్లించాలని.. నాలుగు వారాల్లో అమలు చేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

ఆయన యువతకు ఆదర్శం...రాజకీయాలకు నిదర్శనం. పొలిటికల్ అరంగేట్రం నుండి ప్రజాసేవలో తనదైన శైలిలో ముద్ర వేసుకుని అంచలంచలుగా ఎదుగుతూ మండల రాజకీయాలనుండి మొదలైన ఆయన ప్రస్థానం మెల్లమెల్లగా నియోజకవర్గం, అక్కడి నుండి జిల్లా రాజకీయాలలో ప్రవేశించి తన రాజకీయ పటిమను ప్రదర్శించాడు. రాజకీయాలలో ఆరితేరిన ఉద్దండుల చేత శభాష్ అనిపించుకున్నాడు. ఎటువంటి ఎన్నికలైనా తన ఎత్తుగడలతో ప్రత్యర్థులను మట్టి కరిపించే పాచికలు వేయడంలో ఆయనకు ఆయనే సాటి అనేలా ప్రశంసలు పొందాడు. ఎంతోమంది యువకులను రాజకీయాల వైపు మళ్ళించి పలువురికి ఆదర్శప్రాయుడు అయ్యాడు. శరణార్థై వచ్చిన శత్రువు కైనా మేలు చేకూర్చే ఆయన తత్వం పలువురికి ఆదర్శంగా నిలుస్తుందనడంలో అతియో శక్తి లేదు. కాలం కలిసి వచ్చినా, అవకాసాలు ఉన్నా ఎటువంటి పదవులు ఆశించకుండా పార్టీ ఆదేశాలను శిరోధార్యంగా భావించి పనిచేసిన మహోన్నత వ్యక్తి నేడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయుడుకుడిగా ఎదిగిన రాజకీయ శక్తి ఆయనే...



# యువతకు ఆదర్శం.. రాజకీయాలకు నిదర్శనం తుళ్లూరి బ్రహ్మన్న

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడిగా.. మంత్రి పొంగిలేటికి ముఖ్య అనుచరుడుగా రాష్ట్ర రాజకీయాల్లో తనదైన శైలిలో ముద్ర

- దొడ్డ నరసయ్య మరణంతో రాజకీయ అరంగేట్రం
- ప్రజాసేవకు ప్రభుత్వ కొలువు త్యాగం
- ఆపద్కాలంలో ప్రజలకు అండగా తుళ్లూరి
- రాజకీయాలలో తిరుగులేని శక్తిగా అన్న
- అశ్వాపురం మండల ప్రజలకు పెద్దన్నగా ఆయన రాజకీయ సేవలు





**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో మూడు దశాబ్దాల క్రితం తెలుగుదేశం పార్టీకి అవి తిరుగులేని రోజులు. రాజకీయాలలో దొడ్డ నరసయ్య ఏకచత్రాధిపత్యన్ని కొనసాగిస్తున్న తరుణమది. రాజకీయాలలో తనదైన శైలిలో ముద్ర వేసుకున్న ఆయన తెలుగుదేశం పార్టీ హయాంలో మండల పరిషత్ ఎన్నికలలో తన సమీప అభ్యర్థి పై తిరుగులేని ఆదిత్యంతో గెలుపొందాడు. మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన పదవి బాధ్యతలను దిగ్విజయంగా నిర్వహించాడు. మండలంలోని బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ తెలుగుదేశం పార్టీని అశ్వాపురం మండలంలో అగ్రగామిగా నిలిపాడు. అనంతరం అనారోగ్య కారణాలతో ఆయన అకాల మరణం చెందాడు. అప్పటికే ఉద్యోగ బాధ్యతలను చేపట్టిన తుళ్లూరి బ్రహ్మయ్య రాజకీయాలలో చేరి ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేసేందుకు నిర్ణయించుకున్నాడు. అతి చిన్న వయసులోనే రాజకీయ అరంగేట్రం చేసిన ఆయన అనదైన శైలిలో పార్టీని ముందుకు నడుపుతూ అనతి కాలంలోనే అశ్వాపురం మండలం పై పట్టు సాధించి తెలుగుదేశం పార్టీని తిరుగుతూనేని శక్తిగా తయారు చేశాడు. అనంతరం 1995లో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన ప్రతిపక్ష పార్టీలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా రాజకీయాలలో దూసుకుపోయాడు. ప్రజలకు పెద్దన్నగా సుపరిచితుడై నిలిచాడు.

**పలుమార్లు ప్రజాప్రతినిధిగా తుళ్లూరి :**

అశ్వాపురం మండలంలో తెలుగుదేశం పార్టీని తుళ్లూరి నాయకత్వంలో తిరుగులేని పార్టీగా తయారుచేసిన ఆయన మండలం నుండి పలుమార్లు ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారు. ఎంపీపీ, జడ్పిటిసి, ఉమ్మడి ఖమ్మం జిల్లా సెంట్రల్ బ్యాంక్ వైస్ చైర్మన్, నాలుగు పర్యాయాలు అశ్వాపురం ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్నికై అనేక పర్యాయాలుగా సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ గా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రైతులకు విశిష్టమైన సేవలు అందించిన తుళ్లూరి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడిగా ఎదిగిన తీరు యువతకు ఆదర్శాన్ని కలిగిస్తుంది. ఎంత ఎదిగిన ఒదిగి ఉండే ఆయన తత్వం పలువురిని రాజకీయాల వైపు మళ్ళించేలా చేస్తుంది.

**రాజకీయాలలో ఎందరికో ఆయన ఆదర్శం :**

రాజకీయాలలో తుళ్లూరి ఎందరికో ఆదర్శంగా నిలవడమే గాక ఎంతో మందిని రాజకీయంగా తయారు చేశారు. ఏజెన్సీ ప్రాంతాలలోని గిరిజనులకు రాజకీయాలపై పటిష్టమైన అవగాహన కల్పించినా ఆయన రాజకీయ ప్రస్థానంలో వందలాది మందిని సర్పంచులుగా తయారు చేశారు. సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నిక చేయడంలో ఆయనకు ఆయనే సాటి అనిపించుకుంటూ ఎంతో మందిని ఎంపీటీసీలుగా ఎన్నికల బరిలో ఉంచి పదవులను అలంకరించేలా ఆయన ఎన్నికల పోరాట పటిమను చూపాడు. బడుగు బలహీన వర్గాల వారిని ఎంపీపీలుగా, జడ్పిటిసిలుగా గెలిపించి హరిజన గిరిజనులను చట్టసభలకు పంపేందుకు ముఖ్య భూమిక పోషించారు. ఎంతోమంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యేందుకు రాజకీయాలలో ముఖ్య భూమిక పోషించాడు తుళ్లూరి బ్రహ్మయ్య.

**ప్రభుత్వ కొలువును త్యాగం చేసి ప్రజాసేవకే అంకితం :**

సామాజికంగా, ఆర్థికంగా ఓ స్థాయిలో ఉన్న కుటుంబం నుండి రాజకీయాలలోకి ప్రవేశించిన తుళ్లూరి బ్రహ్మయ్య ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో గత మూడున్నర దశాబ్దాల కాలం క్రితమే సింగరేణి కాలరీస్ లో చేస్తున్న ప్రభుత్వ కొలువును అలవోకగా వదిలేశాడు. ఉద్యోగం చేస్తే ఉన్నత స్థానాలకు వెళ్లి తన భార్య పిల్లలతో సుఖంగా ఉండడంతో పాటు మెరుగైన ఆర్థిక స్థితిగతులను సంపాదించుకోవచ్చు అని తెలిసి కూడా రాజకీయాలపై ఉన్న మక్కువతో తృణప్రాయంగా నౌకరి వదిలేసి రాజకీయాలలో క్రియాశీలకంగా చేరాడు. రాజకీయ ప్రవేశం దగ్గర నుండి మొదలుకొని గ్రామస్థాయి నుండి నేడు రాష్ట్ర స్థాయి లీడర్ గా ఎదిగిన తుళ్లూరి నూటికి నూరు శాతం యువతకు ఆదర్శంగా రాజకీయాలకు నిదర్శంగా నిలుస్తున్నాడు అనేది అక్షర సత్యం.

# అమ్మకు ఆదివారం బోనాలు

## అమ్మకు బోనం ఊరంతా సంబరం

## మా గ్రామాన్ని కాపాడే కల్పవల్లి శ్రీ కనకదుర్గమ్మ

**అడవిదేవులపల్లి విశాల భారతి**

బోనం దేవికి సమర్పించే నైవేద్యం, మహిళలు పండిన అన్నంతో పాటు పాలు, పెరుగు, బెల్లంతో కూడిన బోనాన్ని మట్టి కుండలలో తమ తల పై పెట్టుకుని, డప్పుగాళ్ళు, చెల్తారు. మహిళలు తీసులె ఈ జోనాల కుండలను చిన్న నేప రెమ్మలతో, పసుపు, కుంకుమ తో అలంకరించి, దానిపై ఒక దీపం ఉంచుతారు. మైనన్ను ఎల్లమ్మ పెద్దన్న కొత్యాలమ్మ అంకాలను పోలేరమ్మ, మారెమ్మ మున్నగు పేర్లు కల ఈ దేని. గుళ్ళను ప్రత్యేకంగా అలంకరిస్తారు.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బోనాలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నాడు..



**ఆచారం:**

అసాధమానంలో దేవి తన పుట్టింటికి వెళుతుందని నమ్మకం అందుకే భక్తులు ఈ పండుగ సమయంలో దేవిని దర్శించుకుని తమ ఇంటికి వచ్చిన భావనతో, భక్తి శ్రద్ధలతోనేగాక, ప్రేమానురాగాలతో జోనాలను ఆహార నైవేద్యంగా సమర్పిస్తారు.

**పోతురాజు:**

పోతురాజు పాత్రను పోషించే వ్యక్తి బలశాలిగా ఉండి, ఒంటికి పసుపు, నుదుటిన కుండము ఓట్లు పెట్టుకొని, కాళ్లకు గజ్జలు కట్టుకొని, ఎర్రపంచే కట్టుకుంటాడు. కొరడాతో కొట్టుకుంటూ చప్పు వాయిద్యంకు అనుగుణంగా నృత్యం చేస్తూ ఊరేగింపులో ప్రత్యేక ఆవర్షంగా కనిపిస్తారు.

**బోనాల పండగకు శాస్త్రీయ కారణాలు:**

బోనం అంటే భోజనం అని అర్థం భోజనాన్ని అషాఢమాసంలో అమ్మవారికి నైవేద్యంగా పెట్టడం ఆచారంగా వస్తున్న సంప్రదాయం. ముందుగా ఆ బోనాన్ని ఒక మట్టి కుండలో వండుతారు అలాపండిన కు సున్నము, పసుపు, కుంకుమ, వేపాకులు కూడా పెట్తారు అలాగే కుండా పై ఒక దీపాన్ని ఉంచుతారు. ఇలా పండిన భోసం ఎంత పవిత్ర మైందంటే అంతే శుభ్రమైనది కూడా. అలా వండిన భోదానికి సున్నం, పసువు, వేపాకులు పెట్టడం వలన ఎటువంటి చెడు క్రిమి కీటకాలు రావు, ఇందులో వాడిన సున్నం, పసుపు, వేపాకులు ఇవ్వన్ని యాంటీ సెప్టిక్, యాంటీ డైయోటిక్ సంబంధించినవే కాబట్టి ఇందులో ఎటువంటి క్రిమి కీటకాలకు బోనం లోపలి వెళ్ళే అవకాశం లేదు. అందువలన ఈ జోదానికి అంతపవిత్రత, శుభ్రత ఉంటుంది. అలాగే మనం పోసం పై దీపం ఎందుకు పెడతారంటే ఒకవేళ మనం కోసం ఎత్తుకొని వెళ్ళేకనుక చీకటిగా ఉంటే అప్పుడు మనకు కీపమే మనకు త్రోన్వ చూపిస్తుంది అంటే దారిలో వెలుగుల ఆనమాట.

**ఆషాఢ మాసంలో పండగ ఎందుకు చేస్తారు:**

మనకు ముఖ్యంగ వానా కాలం ఆషాఢ మాసంలో మొదలై శ్రావణ మాసం భద్రపద మాసంలో ముగుస్తుంది. వానాకాలంలో మనదు శబరా, మలేరియా వంటి ఇంటు వ్యాధులు తొల త్వరగ వ్యాపిస్తాయి. వానా కాలంలో వచ్చే అంటూ వ్యాధులు చాలా ప్రమాదకరం. సాధారణంగా ఈ అంటు వ్యాధులు క్రిమి. కీటకాలతో పాటు ఇతర ప్రమాద జంతువుతో వచ్చే ప్రమానం కూడా ఉంది. అందువల్ల ఆషాఢ మాసంలో ఈ బోనాల పండుగ జరుపుకుంటారు. అలాగే ఈ పెట్టుకుంటారు ఎందుకంటే వానాకాలంలో మహిళలకు ఇదీ కాళ్ళు వెడుతయీా ఇలా కాకుండా మహిళలు పసుపును కాళ్ళకు పెట్టుకుంటారు. అసలు పండగడు ఆషాఢ మాసానికి సంబంధం ఏంటంటే బోనాల పండుగకు అలంకారంగా ప్రతి ఇంటి గుమ్మాలకు, ప్రతి వీధి వీధికి వేసారు ముండలు కడ్తారు. రనుక ఆ వేపాకులో ఉండే గుణ్ణం క్రిమి కీటకాలను నాశనంచేస్తుంది కాబట్టి ఈ వండగలో వేపాకులు ప్రధానంగా వాడుతారు. వేపాకులో ఉన్న గుణ్ణం చల్ల ఎటువంటి అంటూ వ్యాధులుమనలు రావు

**బలి:**

బోనాల పండుగలో ముఖ్యమైనది బలి. ప్రధానంగా బోనాల పండుగకు మేరలను, గొర్రెలను, కోళ్లను అమ్మవారికి బలి ఇస్తారు. ఈ బలికి కూడా శాస్త్రీయ కారణాలు ఉన్నాయి. సాధారణంగా ఈ అడ రసంలో మొదలైయే నానా కాలం వలన వచ్చే అంటూ వ్యాధులు మనుషుల కన్నా ముందు కోళ్లకు, వేళలకు, గర్రెలకు మొదలైన వాటికి త్వరగా సోకే ఆవకాశం ఉంది కనుక వ్యాధి సోకక ముందే వాటిని బలిస్తారు. బహుశా అందువలనే శ్రామణ మాసం లో కొంత మంది మాంసాహారం తినకు

**అమ్మవారి ఊరేగింపు:**

బోనాల పండుగలో ముఖ్యమైన చుట్టం అమ్మవారి ఊరేగింపు సమయంలో అమ్మవారి రథం ముందు దప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, వేపాకులతో పాటు, గుర్జీలం లేదా మైసాని పొగలు వేస్తారు. ఈ ఊరేగింపు కూడా కాడుశాలు ఉన్నాయి. ఊరేగింపు సమయంలో కప్ప చప్పుళ్లకు తప్పుక్షతో పాటు పోతరాజులు నృత్యం వేస్తూ అరుస్తారు. అప్పుడు డప్పు చప్పుడు పోతురాజుల అరుపులకు ఊరిలో ఉన్న కొన్ని ప్రమాదకరమైన జంతువులు భయంతో పారిపోతాయి



**గుగ్గీలం:**

అమ్మవారి ఊరేగింపు సమయంలో అమ్మవారికి గుగ్గిలం లేదా మైసా పొగ వేస్తారు, అంతకు పొగ ఎందుకు వేస్తారంటే, వానా కాలంలో దోమలు, ఇతర కీటకాలు నాలు వ్యాపిస్తాయి. అప్పుడు పొగ వల్ల అటువంటి క్రిమి కీటకాలు చనిపోతాయి అందువలన అమ్మవారికి పైసాచి లేదా గుగ్గిలం పొగలు వేస్తారు...

**విందు సంబరాలు:**

బోనాలు పండుగ దేవికి నైవేద్యము సమర్పించు పండుగ కావడం చేత, ఆ ప్రసాదాన్ని కుటుంబ సభ్యులు అతిథులతో పాటు స్వీకరిస్తారు. నివేదనానంతరం మాంసాహార విందు భోజనం మొదలవుతుంది. పండుగ జరిగే ప్రాంతాలలో వేపాకులతో అలంకరించబడిన వీరులు దర్శనమిస్తాయి. జానపద శైలిలో ఉండే అమ్మవారి కీర్తనలతో నిండిన మైకుసెట్ల హెరాదులో పండుగ వాతావణం మొదలవుతుంది..

— స్టోరీ బై అడవిదేవులపల్లి రిపోర్టర్ చప్పిడి శ్రావణ్



# 'దృక్ సిద్ధాంత పంచాంగం' అభినందనీయం

**విశాల భారతి, హైదరాబాద్:**

రాష్ట్రంలోని 16 వేల ఆలయాల్లో అమలు పరిచేందుకు దృక్ సిద్ధాంత పంచాంగం రూపొందించడం అభినందనీయమని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రశంసించారు. గురువారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పంచాంగ సిద్ధాంతకర్తల సమావేశంలో తీసుకు న్న నిర్ణయాలను దృక్ సిద్ధాంత పంచాంగ కర్తల సమాఖ్య ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ పండితు లు ఇచ్చిన నివేదికను దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, పంచాయతీరాజ్, పౌర సంబంధాల శాఖ మంత్రులు, అధికారులతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. గ్రామస్థాయిలో పురోహితులకు, అన్ని కులాల అర్చకులకు ప్రభుత్వం తరపున పండుగలకు సంబంధించి ముందస్తుగా సమాచారం అందిస్తామని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ అర్చక, ఉద్యోగ జేఏసీ ఛైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, దృక్ సిద్ధాంత పంచాంగ కర్తల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అవసరాల ప్రసాద్ శర్మ సిద్ధాంతి, పురోహితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర నాగేంద్ర శర్మ, పెరంబదూర్ శ్రీకాంత్ స్వామి తదితరులున్నారు.



# టాలీవుడ్‌లో రితికా నాయక్ హవా..

టాలీవుడ్ యంగ్ అండ్ బ్యూటీఫుల్ హీరోయిన్ రితికా నాయక్ ప్రస్తుతం టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌తో థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ చిత్రంలో చైత్ర అనే మోడరన్ పాత్రలో కనిపించిన రితికా నాయక్ తన అద్భుతమైన అభినయంతో పాటు అందచందాలతో కుర్రకారును ఎంతగానో ఫిదా చేస్తున్నారు. తెరపై ఆమె లుక్స్, పెర్ఫార్మెన్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అయితే కెరీర్ ప్రారంభం నుండి వరుస విజయాలను సొంతం చేసుకుంటూ వస్తున్న ఈ అమ్మడు, టాలీవుడ్‌లో తిరుగులేని 'గోల్డెన్ హ్యాండ్' లేదా 'లక్కీ ఛార్మ్' అనే ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. అశోక వనములో అర్జున కల్యాణం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన రితికా నాయక్, ఆ తర్వాత వచ్చిన చిత్రాలతోనూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరచుకున్నారు. ఏ పాత్రనైనా తన సహజమైన నటనతో రక్తికట్టించగల నటిగా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీకి, ఇప్పుడు టాలీవుడ్‌లో వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. సినిమాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తూ, కథాబలమున్న పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న రితికా నాయక్ భవిష్యత్తులో మరిన్ని క్రేజీ ప్రాజెక్ట్‌లతో టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.